www.udyamakeratam.com
RNI: TGTEL/25/A0273

1వ వార్షికోత్సవం

# ఉద్యమ కెరటం

నిజం రక్షతి రక్షితః
UDYAMA KERATAM TELUGU DAILY
తెలుగు దినపత్రిక

| ఆసిఫాబాద్ | సంపుటి: 2 | సంచిక: 84 | 8-9-2026 | మంగళవారం | పేజీలు: 8 | వెల : రూ.2/- |

## ఫేక్ వీడియో అని తెలియదు

- వివాదంపై అభిజిత్ దీప్కే వివరణ
- రామజన్మభూమి ట్రస్ట్ సీఈవో పేరుతో వీడియో షేర్
- తప్పుదోవ పట్టించే పోస్టంటూ నెటిజన్ల విమర్శలు
- వ్యక్తిగత జీవితంపై అభ్యంతరం లేదన్న దీప్కే



.. వివరాలు 4లో

## దేశ ప్రగతికి మహిళలే మార్గదర్శకులు

- భారత చరిత్రలో వారి పాత్ర కీలకం
- లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా
- స్వాతంత్ర్య పోరాటం నుంచి దేశ నిర్మాణం వరకు చెరగని ముద్ర
- అన్ని రంగాల్లో మహిళల అద్భుత విజయాలు

4



## గ్యాస్ వినియోగదారులకు శుభవార్త

- గ్రామీణ ప్రాంతాల్లోనూ 25 రోజులకే రీఫిల్ బుకింగ్
- పట్టణ, గ్రామీణ ప్రాంతాలకు ఒకే నియమం
- రీఫిల్ బుకింగ్ నిబంధనల్లో మార్పులు
- కేంద్రం నుంచి కీలక ఉత్తర్వులు

4





# కోటి ఓట్ల తొలగింపునకు కుట్ర

తెలంగాణలో దాదాపు కోటి ఓట్లను తొలగించేందుకు కుట్ర జరుగుతోందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సంచలన ఆరోపణలు చేశారు. ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ 'సర్' ప్రక్రియను అడ్డుపెట్టుకుని బీజేపీకి వ్యతిరేకంగా ఓటు వేసే వర్గాలను గుర్తించి వారి ఓట్లను తొలగించే ప్రయత్నం జరుగుతోందని విమర్శించారు. ఎన్నికలు వచ్చినప్పుడు చూసుకుందామనే నిర్లక్ష్యం వద్దని.. భవిష్యత్ ఎన్నికల్లో గెలుపోటములను నిర్ణయించే కీలక అంశంగా 'సర్' మారనుందని హెచ్చరించారు.

- బీజేపీ వ్యతిరేక ఓట్లపై ప్రత్యేక నిఘా
- కొడంగల్‌లో 81 వేల ఓట్లు గల్లంతు
- పేదలు, గిరిజనుల ఓట్లపైనా కుట్ర
- దీనిపై లౌకిక శక్తులు ఏకం కావాలి
- సర్ పై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

**హైదరాబాద్, సెప్టెంబర్ 7 (ఉద్యమ కెరటం):** తెలంగాణలో కోటి ఓట్లను తొలగించే కుట్ర జరుగుతోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆరోపించారు. ఓటర్ల జాబితా సవరణ (సర్) ప్రక్రియపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వ్యతిరేక ఓటర్లను గుర్తించేందుకు బీజేపీ ప్రత్యేక ఏజెన్సీలను ఏర్పాటు చేసిందని విమర్శించారు. 2009 నుంచి ఓటింగ్ సరళిని పరిశీలించి బీజేపీకి వ్యతిరేకంగా ఉన్నవారి ఓట్లు తొలగిస్తున్నారని ఆరోపించారు. రవీంద్రభారతిలో నేడు రైతు నేత

మిగతా 2 లో

## స్పీకర్‌పై వ్యాఖ్యలతో సభలో

# దుమారం



- తాతా మధును బర్తరఫ్ చేయాలి: ఏలేటి
- కేసీఆర్ క్షమాపణ చెప్పాలని డిమాండ్
- 'స్పీకర్‌ను ఉద్దేశించి అనలేదు' అన్న తాతా మధు
- అపార్థమైతే మాటలు వెనక్కి తీసుకుంటానని వివరణ
- 22-ఏ భూములపైనా బీజేపీ నిలదీత

**హైదరాబాద్, సెప్టెంబర్ 7 (ఉద్యమ కెరటం):** తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌ను ఉద్దేశించి బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు చేసినట్లుగా భావిస్తున్న వ్యాఖ్యలు సోమవారం సభలో తీవ్ర దుమారం రేపాయి. తాతా మధుపై చర్యలు తీసుకోవాలని అధికారపక్షంతో పాటు బీజేపీ డిమాండ్ చేయగా.. తన వ్యాఖ్యలు స్పీకర్‌ను ఉద్దేశించి చేసినవి కావని తాతా మధు వివరణ ఇచ్చారు. తన మాటలు స్పీకర్‌ను ఉద్దేశించినట్లుగా భావిస్తే వాటిని ఉపసంహరించుకుంటున్నానని, విచారం వ్యక్తం చేస్తున్నానని ప్రకటించారు. సభలో బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. రాజ్యాంగబద్ధమైన స్థానంలో ఉన్న స్పీకర్‌పై అనుచిత భాషను ఉపయోగించడం తీవ్రంగా ఖండించాల్సిన విషయమన్నారు. బీజేపీ

మిగతా 2 లో

## మరోసారి 'సర్' గడువు పొడిగింపు

- అక్టోబర్ 7 వరకు పొడిగిస్తూ ఈసీ నిర్ణయం
- నవంబర్ 9న తుది ఓటర్ల జాబితా విడుదల



2

## ఉద్యోగాల పేరుతో యూట్యూబర్ మోసం

శంషాబాద్ విమానాశ్రయంలో అరెస్ట్

2

యూట్యూబర్ నందనను శంషాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆమెపై ఇప్పటికే లుకౌట్ నోటీసులు పెండింగ్‌లో ఉండటంతో విమానాశ్రయంలో ఆమెను గుర్తించి అరెస్ట్ చేశారు.



## ప్రారంభమైన అసెంబ్లీ సమావేశాలు

- నిషేధిత భూములు 22ఏ జాబితాపై సభలో రగడ
- ప్లకార్డులు ప్రదర్శిస్తూ సభలో బీజేపీ నినాదాలు
- 22ఏ అంశంపై చర్చకు పూర్తిగా సిద్ధంగా ఉన్నాం
- సభ సజావుగా సాగేందుకు సహకరించాలి

22ఏ జాబితాపై మంత్రి శ్రీధర్ బాబు వివరణ

వచ్చే బోనాల నాటికి ఇందిరమ్మ ఇళ్లు పూర్తి

అసెంబ్లీలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

2





2

## అసెంబ్లీకి వెళ్లే ఎమ్మెల్యేలను

# అడ్డుకోవద్దు

- తెలంగాణ రాష్ట్ర హైకోర్టు పోలీసులకు ఆదేశం
- ఉల్లంఘనపై స్పీకర్ చర్యలు తీసుకుంటారు
- రాష్ట్ర హోం శాఖకు హైకోర్టు నోటీసులు జారీ

# అసెంబ్లీ గేటు వద్ద హైటెన్షన్

- బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల అడ్డగింత
- కేటీఆర్, హరీశ్, జగదీశ్‌రెడ్డికి గాయాలంటూ ఆరోపణ
- మహిళా ఎమ్మెల్యేల పట్ల దురుసుగా వ్యవహరించారని ఆగ్రహం
- పలువురు ప్రజాప్రతినిధుల అరెస్టు
- రాష్ట్రవ్యాప్త నిరసనలకు బీఆర్ఎస్ పిలుపు

2





## ముగిసిన బీఏసీ సమావేశాలు

3

- ఈనెల 12 వరకు అసెంబ్లీ

## నా వ్యాఖ్యలు స్పీకర్‌ను ఉద్దేశించి చేసినవి కావు

శాసనసభ ఘటనపై తాతా మధు వివరణ

3

ఉద్యమ కెరటం
నిజం రక్షతి రక్షితః UDYAMAKERATAM TELUGU DAILY తెలుగు దినపత్రిక
మంగళవారం
8 సెప్టెంబర్ 2026



# మరోసారి 'సర్' గడువు పొడిగింపు

## అక్టోబర్ 7 వరకు పొడిగిస్తూ ఈసీ నిర్ణయం

## నవంబర్ 9న తుది ఓటర్ల జాబితా విడుదల

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 7 (ఉద్యమ కెరటం):** తెలంగాణలో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (సర్) కార్యక్రమం గడువును కేంద్ర ఎన్నికల సంఘం పొడిగించింది. జాబితాపై అభ్యంతరాలు, క్లెయిమ్‌లు దాఖలు చేసేందుకు అక్టోబర్ 7వ తేదీ వరకు అవకాశం కల్పించింది. ఈ మేరకు సవరించిన షెడ్యూల్‌ను ఈసీ విడుదల చేసింది. గతంలో పొడిగించిన షెడ్యూల్ ప్రకారం ఈ గడువు సెప్టెంబర్ 16తో ముగియాల్సి ఉంది. అయితే, ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియకు మరింత సమయం కావాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి కేంద్ర ఎన్నికల సంఘానికి వేర్వేరుగా లేఖలు రాశారు. వారి విజ్ఞప్తిని సానుకూలంగా పరిగణనలోకి తీసుకున్న ఎన్నికల సంఘం, గడువును మరోసారి పొడిగిస్తూ నిర్ణయం తీసుకుంది. కొత్త షెడ్యూల్ ప్రకారం అక్టోబర్ 7 వరకు అభ్యంతరాలను స్వీకరించి, వాటిని పరిష్కరించిన అనంతరం నవంబర్ 9వ తేదీన తుది ఓటర్ల జాబితాను ప్రచురించనున్నారు. ఈసీ నిర్ణయంతో కొత్తగా ఓటరుగా నమోదు చేసుకోవాలనుకునే వారికి, అలాగే జాబితాలో తప్పులను సరిదిద్దుకోవాలనుకునే వారికి అదనపు సమయం లభించినట్లయింది.

# ఉద్యోగాల పేరుతో యూట్యూబర్ మోసం

## శంషాబాద్ విమానాశ్రయంలో అరెస్ట్

**హైదరాబాద్, సెప్టెంబర్ 7 (ఉద్యమ కెరటం):** ప్రముఖ యూట్యూబర్ నందనను శంషాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆమెపై ఇప్పటికే లుకౌట్ నోటీసులు పెండింగ్‌లో ఉండటంతో విమానాశ్రయంలో ఆమెను గుర్తించి అరెస్ట్ చేశారు. అనంతరం ఆమెను ఇబ్రహీంపట్నం పోలీసులకు అప్పగించారు. వివరాల్లోకి వెళితే.. నందన, ఆమె భర్త కలిసి లండన్‌లో ఉద్యోగాలు ఇప్పిస్తామని పలువురి నుంచి పెద్ద మొత్తంలో డబ్బులు వసూలు చేశారని ఆరోపణలు ఉన్నాయి. ఈ మోసంపై బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఇబ్రహీంపట్నం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ కేసులో భాగంగానే ఆమెపై లుకౌట్ నోటీసులు జారీ అయ్యాయి. ఈ క్రమంలో సోమవారం శంషాబాద్ విమానాశ్రయానికి వచ్చిన నందనను ఇమ్మిగ్రేషన్ అధికారులు గుర్తించి, ఎయిర్‌పోర్ట్ పోలీసులకు సమాచారం అందించారు. వారు వెంటనే ఆమెను అదుపులోకి తీసుకుని, కేసు విచారణ చేస్తున్న ఇబ్రహీంపట్నం పోలీసులకు అప్పగించారు. ఈ ఘటనకు సంబంధించి మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది. పోలీసులు కేసు దర్యాప్తును కొనసాగిస్తున్నారు.

# అసెంబ్లీకి వెళ్లే ఎమ్మెల్యేలను అడ్డుకోవద్దు

## తెలంగాణ రాష్ట్ర హైకోర్టు పోలీసులకు ఆదేశం

## ఉల్లంఘనపై స్పీకర్ చర్యలు తీసుకుంటారు

## రాష్ట్ర హోం శాఖకు హైకోర్టు నోటీసులు జారీ

**హైదరాబాద్, సెప్టెంబర్ 7 (ఉద్యమ కెరటం):** తెలంగాణ శాసనసభకు వెళ్లే ఎమ్మెల్యేలను అడ్డుకోవద్దని రాష్ట్ర పోలీసులను హైకోర్టు సోమవారం ఆదేశించింది. శాసనసభ్యులు ఏవైనా నిబంధనలు ఉల్లంఘిస్తే ఆ వ్యవహారాన్ని స్పీకర్ చూసుకుంటారని, పోలీసులు వారిపై ఎలాంటి చర్యలు తీసుకోరాదని న్యాయస్థానం స్పష్టం చేసింది. అసెంబ్లీ సమీపంలో సోమవారం ఉదయం చోటుచేసుకున్న పరిణామాలను పరిగణనలోకి తీసుకున్న ఉన్నత న్యాయస్థానం, ఈ మేరకు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఉదంతంపై రాష్ట్ర హోం శాఖకు హైకోర్టు నోటీసులు జారీ చేసింది. విచారణలో భాగంగా, మహిళా ఎమ్మెల్యేలపై దాడికి పాల్పడ్డారన్న ఆరోపణలు ఎదుర్కొంటున్న పోలీసు అధికారులను గుర్తించాలని ఆదేశించింది. ఈ ఘటనపై పూర్తిస్థాయి విచారణ జరిపి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేసింది. ఈ మొత్తం వ్యవహారంపై సమగ్ర నివేదికను సమర్పించాలని డీజీపీని ఉన్నత న్యాయస్థానం ఆదేశించింది. అనంతరం తదుపరి విచారణను రెండు వారాలకు వాయిదా వేసింది. ఉదయం అసెంబ్లీ వద్ద జరిగిన పరిణామాల నేపథ్యంలో హైకోర్టు ఆదేశాలు అత్యంత ప్రాధాన్యత సంతరించుకున్నాయి.



# కోటి ఓట్ల తొలగింపునకు కుట్ర

మొదటి పేజీ తరువాయి

సారంపల్లి మల్లారెడ్డి సంస్మరణ సభ జరిగింది. ఈ కార్యక్రమంలో సీఎం మాట్లాడారు. నరేంద్ర మోదీ విధానాలకు వ్యతిరేకంగా వ్యవస్థ మొత్తం సిద్ధమవుతోందని అన్నారు. అందుకే ఎస్ఐఆర్ పేరుతో కొత్త కుట్రలకు తెరలేపారని ఆరోపించారు. తెలంగాణలో కోటి ఓట్లు తొలగిస్తున్నా బీఆర్ఎస్ స్పందించడం లేదని మండిపడ్డారు. తన నియోజకవర్గం కొడంగల్‌లో వలస వెళ్లిన వేలాది మంది పేదల ఓట్లను తొలగిస్తున్నారని రేవంత్ రెడ్డి ఆరోపించారు. కొడంగల్‌లో 81 వేల ఓట్లను అనామలీస్ జాబితాలో చేర్చారని తెలిపారు. ప్రస్తుత ఓట్లతోనే 2029లో మోదీ ఓటమికి పునాది పడుతుందని అన్నారు. బీజేపీ వ్యతిరేక ఓట్లు అంటే మైనార్టీలవే అనుకోవద్దని సీఎం చెప్పారు. పేదలు, గిరిజనుల ఓట్లను తొలగించే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు. జాతీయ స్థాయిలో లౌకిక శక్తులు ఏకమై మోదీకి వ్యతిరేకంగా పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. రైతుల కోసం జీవితాన్ని అంకితం చేసిన సారంపల్లి మల్లారెడ్డి మరణం రైతాంగానికి తీరని లోటని సీఎం అన్నారు. రైతు సమస్యలపై అవగాహన ఉన్న నాయకత్వం క్రమంగా తగ్గుతోందని పేర్కొన్నారు. కౌలు రైతులు, గిట్టుబాటు ధరలు సహా అనేక రైతు సమస్యలపై సారంపల్లికి అపారమైన అవగాహన ఉందని కొనియాడారు. కమ్యూనిస్టు ఉద్యమాల పోరాటాల వల్లే కాంగ్రెస్ పలు చట్టాలు తీసుకొచ్చిందని రేవంత్ రెడ్డి అన్నారు. కార్మికులు, పేదల సమస్యలపై కమ్యూనిస్టులు చేసిన పోరాటాలు తమ ప్రభుత్వ ఏర్పాటుకు ప్రత్యక్షంగా, పరోక్షంగా దోహదపడ్డాయని చెప్పారు.



తెలంగాణలో సర్? ప్రక్రియ మొదలవ్వకముందు ప్రధాన ప్రతిపక్షం మాట్లాడింది. కోటి ఓట్లు తొలగించిన తర్వాత సర్?కు వ్యతిరేకంగా వారు ఒక్కమాట కూడా మాట్లాడటం లేదు. బీజేపీ కుట్రపూరితంగా వ్యవహరిస్తున్నప్పుడు ప్రధాన ప్రతిపక్షం ఆ అంశాన్ని లేవనెత్తడం లేదు. 2029లో జరగబోవు ఎన్నికల్లో నరేంద్రమోదీ ఓటమికి ఈ ఓట్లతోనే పునాది పడుతుంది. ఈ ఓట్లు తొలగిస్తే మోదీకి వెయ్యేనుగుల బలం చేకూరుతుంది. ఎన్నికలు ఎప్పుడో ఉన్నాయి అప్పుడు చూద్దామనుకోవద్దు. గెలుపోటములను నిర్ణయించేంది ఎస్?ఐఆర్ అని అన్నారు. వ్యవసాయం గురించి సాధికారంగా మాట్లాడగలిగిన వ్యక్తి సారంపల్లి మల్లారెడ్డి అని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. భూమిలోని సారం నుంచి మొదలుపెట్టి నీరు, విత్తనం, పెట్టుబడి, పంట, గిట్టుబాటు ధర.. అన్ని అంశాలు కూలంకషంగా చెప్పేవారని గుర్తుచేశారు. వ్యవసాయం గురించి అవగాహన కోసం సారంపల్లి మల్లారెడ్డి రాసిన పుస్తకాలు చదివానని తెలిపారు. సారంపల్లి మల్లారెడ్డిని తక్కువసార్లే కలిసినప్పటికీ, ఆయన అంటే అపారమైన గౌరవం ఉందని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. కమ్యూనిస్టుల పోరాటాలు కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చేందుకు ఉపయోగపడ్డాయని చెప్పారు. దున్నేవాడితే భూమి అంటూ ఎన్నో రైతు సమస్యలపై కమ్యూనిస్టులు పోరాడారని రేవంత్ రెడ్డి కొనియాడారు. కమ్యూనిస్టులు అంటే తనకు పరోక్షంగా చాలా అభిమానమని వివరించారు. అసైన్డ్?, పోడు పట్టాలు దక్కాయంటే పోరాటం కమ్యూనిస్టులది, పరిష్కారం కాంగ్రెస్?దని వివరించారు. వారి ఉద్యమాల ఫలితంగానే కాంగ్రెస్ అనేక చట్టాలు తెచ్చిందని గుర్తుచేశారు.

# స్పీకర్‌పై వ్యాఖ్యలతో సభలో దుమారం

మొదటి పేజీ తరువాయి

ఎమ్మెల్యేల తరఫున ఈ వ్యాఖ్యలను ఖండిస్తున్నట్లు తెలిపారు. ప్రతిపక్ష నేత కేసీఆర్ దీనిపై సభకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. తాతా మధు కావాలనే ఆ వ్యాఖ్యలు చేశారా? లేక ఎవరైనా ఆయనతో మాట్లాడించారా? అని ఏలేటి ప్రశ్నించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో అత్యున్నత గౌరవం కలిగిన స్పీకర్ పదవిని అవమానించేలా వ్యవహరించినట్లు తేలితే తాతా మధుపై కఠిన చర్యలు తీసుకోవాలని, పదవి నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సైతం ఈ వ్యవహారంపై సభలో తీవ్రంగా స్పందించారు. స్పీకర్‌పై చేసినట్లుగా చెబుతున్న వ్యాఖ్యల విషయంలో కేసీఆర్ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. తాతా మధు వ్యవహారంపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఈ పరిణామాల సందర్భంగా మంత్రి సీతక్క భావోద్వేగానికి గురయ్యారు. స్పీకర్ గడ్డం ప్రసాద్ కూడా తీవ్ర మనస్తాపానికి గురై భావోద్వేగంతో స్పందించడంతో సభలో పరిస్థితి మరింత ఉద్విగ్నంగా మారింది.



### 'నా మాటలు స్పీకర్‌ను ఉద్దేశించినవి కావు'

ఈ వివాదంపై అనంతరం తాతా మధు వివరణ ఇచ్చారు. శాసనసభలోకి వెళ్లే సమయంలో తమ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ముఖ్యంగా మహిళా శాసనసభ్యులకు పోలీసులతో తోపులాట జరిగిందని చెప్పారు. ఆ సమయంలో తనపైనా దాడి జరిగిందని, తన షర్టు, ప్యాంటు లాగేందుకు, గొంతు నొక్కేందుకు ప్రయత్నించినట్లు తనకు అనిపించిందని పేర్కొన్నారు. ఆ పరిణామాలతో ఆవేదనకు గురై.. తనపై దాడి చేసింది ఎవరు? తన దుస్తులు లాగేందుకు ఎవరు ప్రయత్నించారు? అలా చేయాలని ఎవరు ఆదేశించారు? అనే ఉద్దేశంతోనే తాను మాట్లాడినట్లు వివరించారు. ఆ వ్యాఖ్యలు స్పీకర్‌ను ఉద్దేశించి చేసినవి కాదని స్పష్టం చేశారు. స్పీకర్ వ్యవస్థపైనా, వ్యక్తిగతంగా గడ్డం ప్రసాద్‌పైనా తనకు ఎంతో గౌరవం ఉందన్నారు. "నా వ్యాఖ్యల్లో ఏవైనా స్పీకర్‌ను ఉద్దేశించినట్లుగా భావిస్తే వాటిని ఉపసంహరించుకుంటున్నా. అందుకు విచారం వ్యక్తం చేస్తున్నా" అని పేర్కొన్నారు.

### పోలీసుల తీరుపైనా మధు అభ్యంతరం

శాసనసభలోకి వెళ్లే సమయంలో మహిళా శాసనసభ్యులతో పోలీసులు వ్యవహరించిన తీరుపై చర్యలు తీసుకోవాలని తాతా మధు కోరారు. తమ సీనియర్ నేతలను పోలీసులు అక్కడి నుంచి తీసుకెళ్లారని పేర్కొన్నారు. ప్రజలచే ఎన్నుకోబడిన ప్రజాప్రతినిధులతో వ్యవహరించే సమయంలో ప్రభుత్వం తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఈ ఘటనపై ముఖ్యమంత్రి, హోంశాఖ బాధ్యతలు చూస్తున్న రేవంత్‌రెడ్డి స్పందించి విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.

### 22-ఏ భూములపైనా సభలో వేడి

మరోవైపు 22-ఏ నిషిద్ధ భూముల వ్యవహారంపై ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ప్రభుత్వాన్ని నిలదీశారు. ఈ భూముల విషయంలో అక్రమాలు జరిగాయని ఆరోపిస్తూ.. వాటికి బాధ్యత వహించి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. అధికారులపై నెపం మోపి తప్పించుకునే ప్రయత్నం చేయవద్దన్నారు. 22-ఏ భూముల వ్యవహారంపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపిస్తామని మంత్రి శ్రీధర్‌బాబు సభలో స్పష్టమైన హామీ ఇస్తే తమ నిరసన విరమిస్తామని ఏలేటి ప్రకటించారు. దీనిపై ప్రభుత్వం నేరుగా సమాధానం చెప్పకుండా ఇతర అంశాలతో దృష్టి మళ్లిస్తోందని ఆరోపించారు. 'ధరణి' వ్యవహారంపై ఫోరెన్సిక్ ఆడిట్ జరిగిందా? లేదా? అన్నది ప్రభుత్వం స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. ఆడిట్ జరిగి ఉంటే సంబంధిత నివేదికలను బహిరంగపరిచి ప్రజల ముందుంచాలని ఏలేటి మహేశ్వర్‌రెడ్డి కోరారు. స్పీకర్‌పై వ్యాఖ్యల వివాదానికి తాతా మధు వివరణ ఇవ్వడంతో వ్యవహారం కొత్త మలుపు తిరగగా.. అధికార, ప్రతిపక్షాల పరస్పర ఆరోపణలతో అసెంబ్లీ సమావేశాలు మరింత వేడెక్కాయి.

# అసెంబ్లీ గేటు వద్ద హైటెన్షన్

## బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల అడ్డగింత

## కేటీఆర్, హరీశ్, జగదీశ్‌రెడ్డికి గాయాలంటూ ఆరోపణ

## మహిళా ఎమ్మెల్యేల పట్ల దురుసుగా వ్యవహరించారని ఆగ్రహం

## పలువురు ప్రజాప్రతినిధుల అరెస్టు

## రాష్ట్రవ్యాప్త నిరసనలకు బీఆర్ఎస్ పిలుపు

**హైదరాబాద్, సెప్టెంబర్ 7 (ఉద్యమ కెరటం):** తెలంగాణ అసెంబ్లీ సమావేశాల తొలిరోజే ప్రాంగణం వద్ద తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలనలో వైఫల్యాలను నిరసిస్తూ నల్ల టీషర్టులతో అసెంబ్లీకి వచ్చిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను పోలీసులు అడ్డుకోవడంతో తోపులాట చోటుచేసుకుంది. ఈ ఘటనలో కేటీఆర్, హరీశ్‌రావు, జగదీశ్‌రెడ్డి సహా పలువురు నేతలు గాయపడినట్లు బీఆర్ఎస్ పేర్కొంది. పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను పోలీసులు అదుపులోకి తీసుకోవడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన ఆ పార్టీ.. రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు చేపట్టాలని శ్రేణులకు పిలుపునిచ్చింది. కాంగ్రెస్ ప్రభుత్వ వెయ్యి రోజుల పాలనకు నిరసనగా బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు నల్ల దుస్తులు ధరించి అసెంబ్లీకి చేరుకున్నారు. అయితే వారిని పోలీసులు గేటు వద్ద అడ్డుకోవడంతో వాగ్వాదం, తోపులాట చోటుచేసుకున్నట్లు పార్టీ తెలిపింది. తమ ప్రజాప్రతినిధులను అసెంబ్లీలోకి వెళ్లనీయకుండా అడ్డుకోవడం ప్రజాస్వామ్య విరుద్ధమని బీఆర్ఎస్ నేతలు మండిపడ్డారు. అసెంబ్లీ గేటు వద్ద జరిగిన తోపులాటలో మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి కిందపడటంతో కాలికి గాయమైనట్లు బీఆర్ఎస్ తెలిపింది. కేటీఆర్ చేతికి, నుదిటికి గాయాలయ్యాయని పేర్కొంది. హరీశ్‌రావు కిందపడిన సమయంలో ఆయన చేతిపై పోలీసులు కాలు పెట్టారని పార్టీ ఆరోపించింది. నల్ల



టీషర్టుతో అసెంబ్లీలోకి అనుమతించకపోవడాన్ని నిరసిస్తూ హరీశ్‌రావు టీషర్టు విప్పి బనియన్‌తో నిరసన కొనసాగించారు. అనంతరం పోలీసులు ఆయనను అదుపులోకి తీసుకున్నారు. వేముల ప్రశాంత్‌రెడ్డి, కల్వకుంట్ల సంజయ్‌తో పాటు పలువురు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను అదుపులోకి తీసుకుని తెలంగాణ భవన్‌కు తరలించినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. మహిళా ఎమ్మెల్యేలతో పోలీసులు దురుసుగా వ్యవహరించారని బీఆర్ఎస్ తీవ్ర ఆరోపణలు చేసింది. అసెంబ్లీలోకి వెళ్తున్న సునీతా లక్ష్మారెడ్డిని అడ్డుకునే క్రమంలో ఆమె చీరను లాగారని పార్టీ పేర్కొంది. ఈ ఘటనతో ఆమె తీవ్ర ఆవేదనకు గురై కన్నీళ్లు పెట్టుకున్నట్లు తెలిపింది. సబితా ఇంద్రారెడ్డిని అదుపులోకి తీసుకునే సమయంలోనూ పోలీసులు దురుసుగా వ్యవహరించారని, జుట్టు పట్టుకుని వాహనం వైపు తీసుకెళ్లారని బీఆర్ఎస్ ఆరోపించింది. మహిళా ప్రజాప్రతినిధుల పట్ల పోలీసులు వ్యవహరించిన తీరుపై చర్యలు తీసుకోవాలని పార్టీ డిమాండ్ చేసింది. అసెంబ్లీకి వెళ్తున్న తమ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను అడ్డుకోవడం, అరెస్టు చేయడం, మహిళా ప్రజాప్రతినిధులతో దురుసుగా వ్యవహరించారంటూ బీఆర్ఎస్ రాష్ట్రవ్యాప్త నిరసనలకు పిలుపునిచ్చింది. పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎక్కడికక్కడ ఆందోళనలు చేపట్టి అసెంబ్లీ గేటు వద్ద జరిగిన పరిణామాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించింది. ప్రజాప్రతినిధులను అసెంబ్లీలోకి వెళ్లకుండా అడ్డుకోవడం ప్రజాస్వామ్యంపై దాడేనని బీఆర్ఎస్ ఆరోపిస్తూ.. ఈ వ్యవహారాన్ని రాష్ట్రవ్యాప్త ఉద్యమంగా మార్చేందుకు సిద్ధమవుతోంది.

# ప్రారంభమైన అసెంబ్లీ సమావేశాలు

**నిషేధిత భూములు 22ఏ జాబితాపై సభలో రగడ**

**ప్లకార్డులు ప్రదర్శిస్తూ సభలో బీజేపీ నినాదాలు**

**22ఏ అంశంపై చర్చకు పూర్తిగా సిద్ధంగా ఉన్నాం**

**సభ సజావుగా సాగేందుకు సహకరించాలి**

**22ఏ జాబితాపై మంత్రి శ్రీధర్ బాబు వివరణ**

**వచ్చే బోనాల నాటికి ఇందిరమ్మ ఇళ్లు పూర్తి**

**అసెంబ్లీలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి**



**హైదరాబాద్, సెప్టెంబర్ 7 (ఉద్యమ కెరటం):** తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమైన వెంటనే నిషేధిత భూములు 22ఏ జాబితా వ్యవహారంపై సభలో రగడ మొదలైంది. 22ఏ నిషేధిత భూముల నిబంధన కింద ప్రైవేట్ భూముల నమోదుపై సిట్టింగ్ జడ్జితో సమగ్ర విచారణ జరిపించాలని బీజేపీ ఎమ్మెల్యేలు ప్లకార్డులు ప్రదర్శిస్తూ సభలో నినాదాలు చేశారు. ఈ వివాదంపై తక్షణమే విచారణ కమిటీని వేయాలని బీజేపీ సభ్యులు ప్రభుత్వాన్ని పట్టుబట్టారు. ఈ ఆందోళనపై శాసనసభా వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు స్పందించారు. 22ఏ అంశంపై సభలో స్వల్పకాలిక చర్చ చేపట్టేందుకు తమ ప్రభుత్వం సంపూర్ణ సిద్ధంగా ఉందన్నారు. బిజినెస్ అడ్వైజరీ కమిటీ సమావేశంలో ఈ అంశానికి తొలి ప్రాధాన్యత ఇస్తామని, నిబంధనలకు అనుగుణంగా చర్చపై నిర్ణయం తీసుకుంటామని స్పష్టం చేశారు. రాజకీయ ప్రయోజనాల కోసం సభను అడ్డుకోవడం సరికాదని, సమావేశాలు సజావుగా సాగేందుకు సహకరించాలని బీజేపీ ఎమ్మెల్యేలకు ఆయన విజ్ఞప్తి చేశారు. అయితే స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, మంత్రి శ్రీధర్ బాబు సర్దిచెప్పినప్పటికీ బీజేపీ ఎమ్మెల్యేలు వెనక్కి తగ్గకుండా పోడియం వద్ద కాసేపు నినాదాలు చేశారు. విచారణకు నిర్ణయం తీసుకుంటున్నట్లు ప్రకటన చేసేవరకు వెనక్కి తగ్గేదే లేదని స్పష్టం చేయడంతో సభలో తీవ్ర గందరగోళం నెలకొంది. దాంతో తెలంగాణ అసెంబ్లీ 15 నిమిషాల పాటు వాయిదా వేశారు. ఆ తరువాత సభ ప్రారంభం కాగా, బీజేపీ, బీఆర్ఎస్ కుమ్మక్కయ్యాయని బయట వాళ్లు, లోపల వీళ్లు ఆందోళనకు దిగుతున్నారంటూ కాంగ్రెస్ సభ్యులు వ్యాఖ్యానించారు. సభలో ప్రజా సమస్యల పరిష్కారానికి, అర్థవంతమైన చర్చలకు ప్రభుత్వం సిద్ధంగా ఉన్నప్పటికీ బీఆర్ఎస్, బీజేపీ కుమ్మక్కై సభా సమయాన్ని వృథా చేస్తున్నాయని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. ఎస్సీల అభివృద్ధితో పాటు ఫీజు రీయింబర్స్మెంట్, క్రీడల అభివృద్ధి వంటి కీలక అంశాలపై ప్రభుత్వం చర్చకు సిద్ధంగా ఉన్నా... వాటిని వదిలేసి బురదజల్లే రాజకీయం చేయడం ప్రతిపక్షాలకు తగదని సూచించారు. రాష్ట్రంలో కీలకమైన కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన లక్ష కోట్ల కుంభకోణంపై విచారణ కోరుతూ తెలంగాణ ప్రభుత్వం ఏడాది క్రితమే కేంద్రానికి లేఖ రాసినా... ఆ ఎంక్వయిరీని ఎందుకు తొక్కిపెడుతున్నారని బీజేపీ ఎమ్మెల్యేల్ని మంత్రి కోమటిరెడ్డి ప్రశ్నించారు. కాళేశ్వరం విషయంలో విచారణను ప్రధాని మోదీ, కేంద్ర మంత్రి అమిత్ షా ఎందుకు ఆపుతున్నారో బీజేపీ నేతలు సమాధానం చెప్పాలన్నారు. దీనిపై మంత్రి శ్రీధర్ బాబు స్పందిస్తూ 22ఏపై స్వల్ప కాలిక చర్చ పెట్టాలని తెలంగాణ ప్రభుత్వం భావిస్తోందని, 22 ఏ అంశంపై చర్చకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. బీజేపీ సభ్యులు కూర్చోవాలన్న స్పీకర్?, సభ సజావుగా సాగేందుకు సహకరించాలని ఆ పార్టీ సభ్యులను కోరారు. బీఏసీలో నిర్ణయం తీసుకుని 22ఏపై చర్చిద్దామని తెలిపారు. బీఏసీ సమావేశంలో 22 ఏ అంశాన్ని మొదటి ప్రాధాన్యతగా తీసుకుంటామని మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. 22 ఏపై స్వల్ప కాలిక చర్చకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమని హామీ ఇచ్చారు. నియమ నిబంధనలకు అనుగణంగా బీఏసీ సమావేశంలో నిర్ణయం తీసుకుంటామని బీజేపీ ఎమ్మెల్యేలకు చెప్పారు. ప్రతిపక్షాలు చర్చకు సహకరించాలని కోరారు. మంత్రి శ్రీధర్ బాబు, స్పీకర్ సర్దిచెప్పినా బీజేపీ ఎమ్మెల్యేలు వినకుండా 22ఏపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని నినాదాలు చేశారు. రాజకీయాల కోసం సభను అడ్డుకోవడం సరైంది కాదని శ్రీధర్ బాబు విమర్శించారు. సభ సజావుగా సాగేందుకు సహకరించాలని బీజేపీ ఎమ్మెల్యేలను కోరారు. అయితే శ్రీధర్ బాబు విజ్ఞప్తిని బీజేపీ సభ్యులు పట్టించుకోలేదు. పదేపదే ఆయన కోరినా 22ఏ పై తక్షణమే చర్చ జరిగాలని పట్టుపట్టారు. దీంతో సభలో గందరగోళం చెలరేగింది. ఓ దశలో స్పీకర్ సభను వాయిదా వేశారు. సభ తిరిగి ప్రారంభమైన తరువాత కూడా బీజేపీ సభ్యులు తమ ఆందోళనను కొనసాగించారు. వచ్చే బోనాల పండుగ నాటికి ఇందిరమ్మ ఇళ్లు పూర్తి చేస్తామని శాసన మండలిలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపునకు నియోజకవర్గాన్ని యూనిట్?గా తీసుకున్నట్లుగా వివరించారు. లబ్ధిదారులకు మార్కెట్ ధర కంటే తక్కువ రేటుకే సిమెంట్ ఇప్పిస్తామని చెప్పారు. పేదలు నివసించే ప్రాంతంలోనే ఇందిరమ్మ ఇళ్లను కట్టించి ఇస్తామని పొంగులేటి వెల్లడించారు. 2023 ఎన్నికలకు ముందు బీఆర్ఎస్? ప్రభుత్వం హడావిడిగా కొంతమందికి పట్టాలిచ్చిందన్నారు. వారు ఇచ్చిన ఇళ్లలో చాలా మంది నివసించట్లేదని చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో పేదలు నివసించే ప్రాంతానికి 30-40 కిలోమీటర్ల దూరంలో ఇళ్లు ఇచ్చారని, డబుల్? బెడ్‌రూమ్ ఇళ్లలో నివసించే వారిని అంటరాని వారిగా చూసేవారని ఆయన తెలిపారు.



# ముగిసిన బీఏసీ సమావేశాలు

**ఈనెల 12 వరకు అసెంబ్లీ**

హైదరాబాద్, సెప్టెంబర్ 7: శాసనసభ, మండలి సమావేశాల నిర్వహణపై జరిగిన బిజినెస్ అడ్వైజరీ కమిటీ (బీఏసీ) సమావేశాల్లో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఈ మేరకు ఉభయ సభలను ఈనెల 12 వరకు నిర్వహించాలని బీఏసీలో ప్రాథమికంగా నిర్ణయించారు. సమావేశాల పొడిగింపుపై అవసరమైతే మరోసారి సమీక్ష జరపాలని నిర్ణయించారు. స్పీకర్ గడ్డం ప్రసాద్?కుమార్ అధ్యక్షతన ఇవాళ జరిగిన శాసనసభ బీఏసీ సమావేశంలో ప్రధానంగా ప్రజా సమస్యలపై చర్చించేందుకు అజెండా రూపొందించారు. ఈ భేటీకి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, శాసనసభా వ్యవహారాల మంత్రి శ్రీధర్‌బాబు, ఆది శ్రీనివాస్, బీర్ల ఐలయ్య, బీజేపీ శాసనసభా పక్షనేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, ఎంఐఎం ఎమ్మెల్యే బలాల హాజరయ్యారు. ఉదయం శాసనసభకు వెళు తున్న తమపై పోలీసులు దౌర్జన్యం చేశారని నిరసిస్తూ బీఆర్ఎస్ ఈ సమావేశాన్ని బహిష్కరించింది. అసెంబ్లీ బీఏసీ సమావేశంలో 22ఏ, ఫీజు రీఎంబర్స్‌మెంట్‌పై స్వల్పకాలిక చర్చలు జరిపేందుకు నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఇవాళ ఉదయం 22ఏ నిషేధిత భూముల జాబితాపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరపాలని బీజేపీ నేతలు డిమాండ్ చేశారు. దీంతో పాటు మరో 22 కీలకమైన అంశాలపై చర్చ జరిపేందుకు కనీసం 15 రోజుల పాటు అసెంబ్లీలో సమావేశాలు నిర్వహించాలని బీజేపీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఫీజు రీఎంబర్స్‌మెంట్‌తో పాటు మైనారిటీ అంశాలపైనా అసెంబ్లీలో చర్చలు జరపాలని ఎంఐఎం నేత బలాలా సైతం కోరారు. ఈ నేపథ్యంలో సభలో ఎన్నిరోజులైనా సమావేశాలు నిర్వహించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉన్నట్లు శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు. కాగా బీఏసీ సమావేశాన్ని బహిష్కరించిన బీఆర్?ఎస్.. రాష్ట్రంలో ప్రజా సమస్యలు చాలా ఉన్నాయని, అసెంబ్లీని కనీసం 20 నుంచి 30 రోజుల పాటు నడపాలని ఆ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్? డిమాండ్ చేశారు. మరోవైపు శాసనమండలి సమావేశాలను వారం రోజులపాటు నిర్వహించాలని బీఏసీలో నిర్ణయించినట్లు మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్?రెడ్డి తెలిపారు. సభ్యుల కోరిక మేరకు అవసరమైతే మరిన్ని రోజులు పొడగిస్తామని ఆయన పేర్కొన్నారు. సుఖేందర్?రెడ్డి అధ్యక్షతన తన ఛాంబర్?లో మండలి బీఏసీ సమావేశం జరిగింది. సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, శాసన సభ వ్యవహారాలశాఖ మంత్రి శ్రీధర్?బాబు, ఎమ్మెల్సీలు నెల్లికంటి సత్యం, ఎఫ్ఎండీ, శ్రీపాల్ రెడ్డి, శాసన మండలి సెక్రెటరీ డా.నరసింహా చార్యులు పాల్గొన్నారు.

# ‘సీఎం రేవంత్ సారీ చెప్పాల్సిందే’

**ఇది శాసనసభ కాదు.. దుశ్శాసన సభ: కేటీఆర్**

**మహిళా ఎమ్మెల్యేలపై దాడి చేశారంటూ ఫైర్**

**టీషర్టులతో పార్లమెంట్‌కు వెళ్లొచ్చు.. అసెంబ్లీకి రాకూడదా?: హరీశ్**

**ఘటన వెనుక సీఎం కుట్ర ఉందన్న కేటీఆర్**



**హైదరాబాద్, సెప్టెంబర్ 7 (ఉద్యమ కెరటం):** అసెంబ్లీ ప్రధాన గేటు వద్ద బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, పోలీసుల మధ్య జరిగిన తోపులాట రాజకీయంగా తీవ్ర దుమారం రేపింది. మహిళా ఎమ్మెల్యేలతో పోలీసులు వ్యవహరించిన తీరుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి క్షమాపణ చెప్పాలని మాజీ మంత్రి హరీశ్‌రావు డిమాండ్ చేశారు. “రాహుల్‌గాంధీ, ప్రియాంకగాంధీ టీషర్టులతో పార్లమెంట్‌కు వెళ్లొచ్చు.. మేం టీషర్టులతో అసెంబ్లీకి రాకూడదా?” అని ప్రశ్నించారు. మరోవైపు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మరింత తీవ్రంగా స్పందిస్తూ.. “ఇది ముమ్మాటికీ దుశ్శాసన సభ” అని వ్యాఖ్యానించారు. మహిళా ప్రజాప్రతినిధులతో పోలీసులు దురుసుగా వ్యవహరించారని, ఈ ఘటన వెనుక సీఎం రేవంత్‌రెడ్డి కుట్ర ఉందని ఆరోపించారు. కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలన వైఫల్యాలను నిరసిస్తూ నినాదాలతో కూడిన నల్ల టీషర్టులు ధరించి బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు అసెంబ్లీకి వచ్చారు. అయితే ప్రధాన గేటు వద్ద పోలీసులు వారిని అడ్డుకోవడంతో వాగ్వాదం, తోపులాట చోటుచేసుకున్నాయి. పోలీసుల అభ్యంతరంతో హరీశ్‌రావుతో పాటు పలువురు ఎమ్మెల్యేలు టీషర్టులు విప్పి బనియన్లతోనే నిరసన కొనసాగించారు. అనంతరం హరీశ్‌రావు, కేటీఆర్‌తో పాటు పలువురు బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అనంతరం తెలంగాణ భవన్‌లో హరీశ్‌రావు మాట్లాడుతూ.. అసెంబ్లీ చరిత్రలో ఈ రోజు అత్యంత నల్లని రోజుగా మిగిలిపోతుందని వ్యాఖ్యానించారు. తమ టీషర్టులపై ప్రభుత్వ హామీలను అమలు చేయాలనే నినాదాలే ఉన్నాయని చెప్పారు. ప్రజాస్వామ్య పద్ధతిలో నిరసన తెలిపే హక్కు తమకు ఉందన్నారు. “రాహుల్‌గాంధీ, ప్రియాంకగాంధీ నల్ల టీషర్టులు ధరించి పార్లమెంట్‌కు వెళ్లారు. అదే తరహాలో మేం అసెంబ్లీకి వస్తే ఎందుకు అడ్డుకున్నారు? ప్రధాన ప్రతిపక్షం సభలో ఉంటే ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తుందనే భయంతోనే మమ్మల్ని బయట ఉంచారు” అని హరీశ్‌రావు ఆరోపించారు.

**‘మహిళా ఎమ్మెల్యేలపై ఇదేం తీరు?’**

సునీతా లక్ష్మారెడ్డి చీర లాగారని, సబితా ఇంద్రారెడ్డి గొంతు నొక్కారని హరీశ్‌రావు ఆరోపించారు. మహిళా ప్రజాప్రతినిధులతో దురుసుగా వ్యవహరించిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బాధ్యులైన అధికారులను ఎక్కడున్నా వదిలిపెట్టబోమని హెచ్చరించారు. తోపులాటలో జగదీశ్‌రెడ్డిని కిందపడేశారని, కేటీఆర్, సంజయ్, యాదవరెడ్డి, రాజశేఖర్‌రెడ్డికి గాయాలయ్యాయని తెలిపారు. ఆరు గ్యారంటీలు, 420 హామీలు, పింఛన్లు, ఫీజు రీయింబర్స్‌మెంట్, రైతులు, ఉపాధ్యాయులు, ఉద్యోగుల సమస్యలపై సభలో నిలదీస్తామనే భయంతోనే తమను అడ్డుకున్నారని ఆరోపించారు. కేటీఆర్ మాట్లాడుతూ.. ప్రజా సమస్యలపై ప్రశ్నించేందుకు అసెంబ్లీకి వెళ్లిన ప్రతిపక్ష సభ్యులపై పోలీసులు ఉక్కుపాదం మోపారని మండిపడ్డారు. కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలనలో ఇచ్చిన హామీల అమలును ప్రశ్నిస్తూ శాంతియుతంగా నిరసన తెలిపేందుకు ప్రయత్నిస్తే తమపై పోలీసులను ప్రయోగించారని ఆరోపించారు. సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డి వంటి సీనియర్ మహిళా నేతలతో పోలీసులు వ్యవహరించిన తీరు అత్యంత దారుణమన్నారు. మహిళా సాధికారత గురించి కాంగ్రెస్ జాతీయ నాయకత్వం మాట్లాడుతుంటే.. తెలంగాణలో సీనియర్ మహిళా ప్రజాప్రతినిధులతో ఇలాగేనా వ్యవహరించేదని ప్రశ్నించారు. సునీతా లక్ష్మారెడ్డి చీరను పోలీసులు లాగారని, ఆ సమయంలో కోవ లక్ష్మి అడ్డుకున్నారని కేటీఆర్ ఆరోపించారు. జరిగిన పరిణామాలతో సునీతా లక్ష్మారెడ్డి కన్నీళ్లు పెట్టుకోవడం బాధాకరమన్నారు. “ఇది శాసనసభలా లేదు.. దుశ్శాసన సభలా మారింది” అని తీవ్రంగా వ్యాఖ్యానించారు. అయితే బీఆర్ఎస్ ఆరోపణలను ఖైరతాబాద్ డీసీపీ శిల్పవల్లి ఖండించారు. నల్ల టీషర్టులు ధరించడం నేరం కాదని, వాటిపై ఉన్న కొన్ని పదాలపైనే అభ్యంతరం వ్యక్తం చేసినట్లు తెలిపారు. ఆ కారణంగానే వాటితో అసెంబ్లీలోకి అనుమతించలేదని చెప్పారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలతో పోలీసులు అసభ్యంగా ప్రవర్తించలేదన్నారు. స్పీకర్ సూచనల మేరకే పోలీసులు వ్యవహరించారని పేర్కొన్న డీసీపీ.. అసెంబ్లీ గేటు వద్ద జరిగిన ఘటనకు సంబంధించిన వీడియోలను పరిశీలిస్తామని తెలిపారు. బీఆర్ఎస్ నేతలు చేసిన ఆరోపణలనూ పరిశీలిస్తామని చెప్పారు. ఈ ఘటన యాదృచ్ఛికంగా జరిగింది కాదని, ప్రధాన ప్రతిపక్షాన్ని సభకు దూరంగా ఉంచేందుకు పథకం ప్రకారం వ్యవహరించారని కేటీఆర్, హరీశ్‌రావు ఆరోపించారు. 22--ఏ భూములు, ఫీజు రీయింబర్స్‌మెంట్‌తో పాటు ప్రభుత్వ వైఫల్యాలపై చర్చ జరగకుండా బీజేపీ, కాంగ్రెస్ ‘మ్యాచ్ ఫిక్సింగ్’ రాజకీయాలకు పాల్పడుతున్నాయని హరీశ్‌రావు విమర్శించారు. మహిళా ఎమ్మెల్యేలతో జరిగినట్లు చెబుతున్న ఘటనలకు ప్రభుత్వం బాధ్యత వహించాలని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి క్షమాపణ చెప్పాలని బీఆర్ఎస్ నేతలు డిమాండ్ చేశారు. మరోవైపు పోలీసులపై చేసిన ఆరోపణలను వీడియో ఆధారాలతో పరిశీలిస్తామని డీసీపీ ప్రకటించడంతో ఈ వివాదం మరింత రాజకీయ వేడి రేపుతోంది.

# నా వ్యాఖ్యలు స్పీకర్‌ను ఉద్దేశించి చేసినవి కావు

**శాసనసభ ఘటనపై తాతా మధు వివరణ**



**హైదరాబాద్, సెప్టెంబర్ 7 (ఉద్యమ కెరటం):** శాసనసభ బడ్జెట్ సమావేశాల సందర్భంగా సోమవారం చోటుచేసుకున్న పరిణామాలపై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు వివరణ ఇచ్చారు. ఈ ఘటనకు సంబంధించి తాను మాట్లాడని మాటలను తనకు ఆపాదిస్తున్నారని పేర్కొంటూ ఈ విషయంపై తన వివరణ ఇవ్వాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఈ మేరకు ఆయన ఒక కీలక ప్రకటన చేశారు. శాసనసభలోకి వెళ్లే సమయంలో మహిళా శాసనసభ్యులతో పాటు తమ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో తోపులాట, ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయన్నారు. ఈ క్రమంలో తనపై కూడా దాడి జరిగిందని, తన షర్టు, ఫ్యాంటు లాగేందుకు, గొంతు నొక్కేందుకు ప్రయత్నించినట్లు అనిపించిందని పేర్కొన్నారు. కొంతమంది తనను దుర్భాషలాడినట్లు తెలిపారు. ఈ పరిణామాలతో తీవ్ర ఆవేదనకు గురై తనపై దాడి చేసింది ఎవరు.. తన షర్టు లాగేందుకు ఎవరు ప్రయత్నించారు.. అలా చేయమని ఎవరు ఆదేశించారు అంటూ తాను ప్రశ్నించానన్నారు. అయితే ఈ వ్యాఖ్యలను స్పీకర్‌ను ఉద్దేశించి చేసినవిగా భావించడం సరికాదని స్పష్టం చేశారు. స్పీకర్ వ్యవస్థ పట్ల, వ్యక్తిగతంగా స్పీకర్ పట్ల తనకు ఎంతో గౌరవం ఉందని మధు చెప్పారు. స్పీకర్‌ను ఉద్దేశించి తాను ఎలాంటి వ్యాఖ్యలు చేయలేదన్నారు. ఒకవేళ తన వ్యాఖ్యల్లో ఏదైనా స్పీకర్‌ను ఉద్దేశించినట్లు భావిస్తే ఆ మాటలను ఉపసంహరించుకుంటున్నానని, అందుకు విచారం వ్యక్తం చేస్తున్నానని అన్నారు. శాసనసభలోకి వచ్చే సమయంలో తమ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ముఖ్యంగా మహిళా శాసనసభ్యులతో పోలీసులు వ్యవహరించిన తీరుపై ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. మహిళా శాసనసభ్యులతో తోపులాట జరిగిందని, వారి పట్ల పోలీసులు వ్యవహరించిన తీరుపై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. అదేవిధంగా తమ సీనియర్ నాయకులను పోలీసులు అక్కడి నుంచి తీసుకెళ్లారని తెలిపారు. ప్రజాప్రతినిధులతో వ్యవహరించే విషయంలో ప్రభుత్వం తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. శాసనసభ్యులపై జరిగినట్లు పేర్కొన్న పరిణామాలపై ప్రభుత్వం స్పందించాలని మధు డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి, హోంశాఖ మంత్రి రేవంత్ రెడ్డి ఈ ఘటనపై స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. తాను మాట్లాడిన వ్యాఖ్యలపై ఏర్పడిన వివాదం కంటే శాసనసభలో చోటుచేసుకున్న అసలు పరిణామాలపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందని మధు వ్యాఖ్యానించారు. ప్రజాప్రతినిధుల పట్ల జరిగిన ఘటనలపై సమగ్రంగా పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

# ఫీజు బకాయిలు చెల్లించేదాకా పోరు ఆగదు

**బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు**

**ఫీజు బకాయిలపై అసెంబ్లీ ముట్టడి**

**ప్రభుత్వ తీరుపై ఎంపీల ఆగ్రహం**



**హైదరాబాద్, సెప్టెంబర్ 7 (ఉద్యమ కెరటం):** పేద విద్యార్థులకు చెల్లించాల్సిన రూ. 15,000 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బీజేపీ, బీజేవైఎం చేపట్టిన అసెంబ్లీ ముట్టడి తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. ధర్నా చౌక్ వద్ద ప్రజాస్వామ్యబద్ధంగా ఆందోళన చేసుకునేందుకు పోలీసులు అనుమతి నిరాకరించడంతోనే అసెంబ్లీ ముట్టడికి పిలుపునిచ్చామని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్ రావు తెలిపారు. అసెంబ్లీ ముట్టడికి యత్నించిన రామచందర్ రావు సహా బీజేపీ, బీజేవైఎం ముఖ్య నేతలను, కార్యకర్తలను పోలీసులు బలవంతంగా అదుపులోకి తీసుకుని గోల్కొండ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అరెస్టులు, పోలీసు నిర్బంధాలకు భయపడేది లేదని, ఫీజుల బకాయిలు పూర్తిస్థాయిలో విడుదల చేసేవరకు పోరాటం ఆగదని స్పష్టం చేశారు. పోలీసుల తోపులాట, లాఠీచార్జ్‌ల కారణంగా అమీర్‌పేట్ కార్పొరేటర్ సరళ తీవ్రంగా గాయపడి ఐసీయూలో అత్యవసర చికిత్స పొందుతున్నారని, రాష్ట్రవ్యాప్తంగా 600 మందికి పైగా కార్యకర్తలను అక్రమంగా నిర్బంధించారని నాయకులు ఆరోపించారు. రాష్ట్రంలో ‘చోటా హిట్లర్’ పాలన సాగుతోందని మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ, రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. విద్యార్థుల సమస్యలను పరిష్కరించకపోతే నేరుగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇంటినే ముట్టడిస్తామని బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు గణేష్ కుందే హెచ్చరించగా, శాంతియుతంగా నిరసన తెలిపే హక్కును ప్రభుత్వం కాలరాస్తోందని పార్టీ అధికార ప్రతినిధి రాణి రుద్రమ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పేద విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల కోసం శాంతియుతంగా ఆందోళన చేస్తే పోలీసులు బలప్రయోగానికి దిగారని రాంచందర్‌రావు ఆరోపించారు. తోపులాట, లాఠీచార్జిలో పలువురు నాయకులు, కార్యకర్తలు గాయపడినట్లు పేర్కొన్నారు. ఇటీవల ఎనిమిది లక్షల మంది విద్యార్థుల సంతకాలతో వినతిపత్రం అందించేందుకు ప్రయత్నించినా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అపాయింట్‌మెంట్ ఇవ్వలేదని ఆరోపించారు.

# ‘సమ్మిట్’ ఆహ్వానాలు పంపాలి

**గ్లోబల్ సమ్మిట్ సన్నాహకాలపై సీఎస్ సమీక్ష**

**హైదరాబాద్, సెప్టెంబర్ 7 (ఉద్యమ కెరటం):** రానున్న ఇన్వెస్ట్ తెలంగాణ -- రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2026 నిర్వహణకు సంబంధించి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు సచివాలయంలో ఉన్నతాధికారులతో సోమవారం సమావేశం నిర్వహించి సన్నాహకాలను సమీక్షించారు. గ్లోబల్ సమ్మిట్‌కు దేశ, విదేశాల నుంచి ప్రముఖులు, అంతర్జాతీయ పెట్టుబడిదారులు, పారిశ్రామికవేత్తలు, వివిధ రంగాల ప్రతినిధులు, సీఈఓలు, సీఎక్స్ఓలు, దౌత్యవేత్తలు తదితరులను పెద్ద సంఖ్యలో ఆహ్వానించేలా చర్యలు చేపట్టాలని సీఎస్ అధికారులను ఆదేశించారు. సమ్మిట్‌కు హాజరుకావాల్సిందిగా ప్రముఖులకు ఈ-మెయిల్స్ ద్వారా అధికారిక ఆహ్వానాలు పంపే ప్రక్రియను తక్షణమే ప్రారంభించాలని సూచించారు. ‘ఇన్వెస్ట్ తెలంగాణ’ పేరుతో నిర్వహించనున్న ఈ గ్లోబల్ సమ్మిట్ ద్వారా పెట్టుబడి అవకాశాలను ప్రపంచానికి విస్తృతంగా పరిచయం చేయడంతో పాటు రాష్ట్రాన్ని ప్రపంచ స్థాయి పెట్టుబడుల గమ్యస్థానంగా మరింతగా ప్రతిష్టించేందుకు కృషి చేయాలని సీఎస్ పేర్కొన్నారు. గ్లోబల్ సమ్మిట్‌ను ప్రతిష్టాత్మకంగా, సమర్థవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు పరస్పర సమన్వయంతో సమయపాలనతో కూడిన కార్యాచరణను అమలు చేయాలని సీఎస్ స్పష్టం చేశారు. సమావేశంలో సీనియర్ అధికారులు కృష్ణ ఆదిత్య, అజిత్ రెడ్డి, అనుదీప్ దురిశెట్టి, నిఖిల్ చక్రవర్తి, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



# భారతీయులపై ద్వేషం.. సింగపూర్ సీరియస్

**జాత్యహంకార వ్యాఖ్యలపై ప్రభుత్వ ఆగ్రహం**

**‘సిగ్గుచేటు.. సహించరానివి’ అన్న షణ్ముగం**

**పూర్తిస్థాయి విచారణకు పోలీసులకు ఆదేశం**

**ద్వేషపూరిత పోస్టుల తొలగింపునకు చర్యలు**

**బాధ్యులపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరిక**

**సింగపూర్, సెప్టెంబర్ 7 (ఉద్యమ కెరటం):** సింగపూర్‌లో నివసిస్తున్న భారతీయులు, భారత సంతతి ప్రజలను లక్ష్యంగా చేసుకుని సామాజిక మాధ్యమాల్లో వెలువడుతున్న జాత్యహంకార, ద్వేషపూరిత వ్యాఖ్యలను ఆ దేశ ప్రభుత్వం తీవ్రంగా పరిగణించింది. ఇటువంటి వ్యాఖ్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని స్పష్టం చేస్తూ.. వాటిపై పూర్తిస్థాయి విచారణ జరపాలని పోలీసులను ఆదేశించింది. ఇటీవల చైనా-నేపాల్ సరిహద్దు ప్రాంతంలో సంభవించిన ప్రకృతి వైపరీత్యంలో పలువురు సింగపూర్ పౌరులు గల్లంతైన ఘటనతో పాటు ఎయిర్ ఇండియాలో సింగపూర్ ఎయిర్‌లైన్స్ పెట్టుబడుల అంశాన్ని ముడిపెడుతూ కొందరు సామాజిక మాధ్యమాల్లో భారతీయులను లక్ష్యంగా చేసుకుని అభ్యంతరకర వ్యాఖ్యలు చేసినట్లు కథనాలు వెలువడ్డాయి. ఈ పరిణామాలపై సింగపూర్ ప్రధాని లారెన్స్ వాంగ్, సీనియర్ మంత్రులు కె.షణ్ముగం, లీ సీన్ లూంగ్ తీవ్రంగా స్పందించారు. భారతీయులను లక్ష్యంగా చేసుకుని చేసిన జాత్యహంకార వ్యాఖ్యలను సీనియర్ మంత్రి కె.షణ్ముగం తీవ్రంగా ఖండించారు. వాటిని “అత్యంత సిగ్గుచేటు, హేయమైనవి.. ఎంతమాత్రం సహించరానివి”గా అభివర్ణించారు. ఈ వ్యవహారంపై పూర్తిస్థాయిలో దర్యాప్తు చేపట్టి బాధ్యులను గుర్తించాలని పోలీసు యంత్రాంగాన్ని ఆదేశించినట్లు తెలిపారు. బహుళ జాతులు, మతాలకు చెందిన ప్రజలు కలిసి జీవించే సింగపూర్‌లో సామాజిక సామరస్యాన్ని దెబ్బతీసే వ్యాఖ్యలకు చోటులేదని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఏ వర్గాన్ని లక్ష్యంగా చేసుకున్నా ద్వేషపూరిత ప్రచారాన్ని ఉపేక్షించబోమని హెచ్చరించింది. జాతి, మత సామరస్యానికి భంగం కలిగించే పోస్టులను తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని డిజిటల్ అభివృద్ధి, సమాచార మంత్రిత్వ శాఖ సామాజిక మాధ్యమ వేదికలను కోరింది. ఆన్‌లైన్‌లో ద్వేషాన్ని రెచ్చగొట్టే చర్యలను సాధారణ విషయంగా మారనివ్వబోమని ప్రభుత్వం స్పష్టం చేసింది. సామాజిక మాధ్యమాల వేదికగా ఏ ఒక్క జాతి లేదా వర్గాన్ని లక్ష్యంగా చేసుకుని విద్వేషాన్ని వ్యాప్తి చేసినా చట్టపరమైన చర్యలు తప్పవని సింగపూర్ ప్రభుత్వం హెచ్చరించింది.

# యెమెన్‌లో మళ్లీ భగ్గుమన్న హింస

**నాలుగు రోజుల్లో 117 మంది బలి**

**ప్రభుత్వ దళాలు, హౌతీల భీకర పోరు**

**తాయిజ్, హోదైదాల్లో వైమానిక దాడులు**

**బాబ్ అల్-మందబ్ సమీపంలో ఆందోళన**

**అడెన్, సెప్టెంబర్ 7 (ఉద్యమ కెరటం):** యెమెన్‌లో అంతర్యుద్ధం మళ్లీ తీవ్ర రూపం దాల్చింది. ప్రభుత్వ బలగాలకు, హౌతీ తిరుగుబాటుదారులకు మధ్య దేశ పశ్చిమ ప్రావిన్సులైన తాయిజ్, హోదైదాల్లో గత నాలుగు రోజులుగా జరుగుతున్న భీకర ఘర్షణల్లో కనీసం 117 మంది మరణించారు. వైద్య వర్గాలు వెల్లడించిన వివరాల ప్రకారం, ఈ పోరులో 54 మంది ప్రభుత్వ సైనికులు ప్రాణాలు కోల్పోగా, హౌతీ అధీనంలో ఉన్న ఆసుపత్రుల సమాచారం ప్రకారం 63 మంది తిరుగుబాటుదారులు మరణించారు. దీంతో ఇరుపక్షాల మృతుల సంఖ్య 117కు చేరింది. వ్యూహాత్మకమైన బాబ్ అల్-మందబ్ జలసంధి సమీపంలో హౌతీలు పెద్ద ఎత్తున దాడులకు దిగడంతో ఈ తీవ్ర ఘర్షణలు ప్రారంభమయ్యాయి. హౌతీల ముందడుగును అడ్డుకునేందుకు ప్రభుత్వ దళాలు జరిపిన మెరుపు ఎదురుదాడులు, వైమానిక దాడులతో యుద్ధ వాతావరణం మరింత వేడెక్కింది. ఇటీవల కాలంలో పశ్చిమ యెమెన్ భూభాగంలో ఇంతటి భారీస్థాయిలో భూతల పోరాటం జరగడం ఇదే మొదటిసారని విశ్లేషకులు భావిస్తున్నారు. 2014 చివర్లో హౌతీలు రాజధాని సనాతో పాటు ఉత్తర ప్రాంతాలను ఆక్రమించుకున్నప్పటి నుంచి మొదలైన ఈ అంతర్యుద్ధం, ప్రస్తుత ఘర్షణలతో మళ్లీ పూర్తిస్థాయి తీవ్ర రూపానికి చేరుతోందని తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది.



# ‘ఫేక్ వీడియో అని నాకు తెలియదు’

- వివాదంపై అభిజిత్ దీప్కే వివరణ
- రామజన్మభూమి ట్రస్ట్ సీఈవో పేరుతో వీడియో షేర్
- తప్పుదోవ పట్టించే పోస్టంటూ నెటిజన్ల విమర్శలు
- వ్యక్తిగత జీవితంపై అభ్యంతరం లేదన్న దీప్కే
- సామాజిక మాధ్యమాల్లో కొనసాగుతున్న చర్చ



**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 7 (ఉద్యమ కెరటం):** రామజన్మభూమి ట్రస్ట్ సీఈవోను లక్ష్యంగా చేసుకుంటూ సామాజిక మాధ్యమం ‘ఎక్స్’లో తాను షేర్ చేసిన వీడియో నకిలీదని ముందుగా తెలియదని సీజేపీ వ్యవస్థాపకుడు అభిజిత్ దీప్కే వివరణ ఇచ్చారు. వీడియోలో ఉన్న వ్యక్తిని రామజన్మభూమి తీర్థ ట్రస్ట్ సీఈవో జితేంద్ర మిశ్రాగా పేర్కొంటూ చేసిన పోస్టుపై విమర్శలు రావడంతో ఆయన స్పందించారు. “నేను షేర్ చేసిన వీడియో ఫేక్ అని నాకు తెలియదు. ఏదేమైనా ఎవరి వ్యక్తిగత జీవితం వారిది. దానిపై నాకు ఎలాంటి అభ్యంతరం లేదు” అని దీప్కే పేర్కొన్నారు. బాబీ డియోల్ నటించిన ‘జమాల్ కుడు’ పాటకు ఓ వ్యక్తి నృత్యం చేస్తున్న వీడియోను దీప్కే ఆదివారం తన ఎక్స్ ఖాతాలో షేర్ చేశారు. అందులో కనిపిస్తున్న వ్యక్తి రామజన్మభూమి తీర్థ ట్రస్ట్ సీఈవో జితేంద్ర మిశ్రా అని పేర్కొన్నారు. వ్యక్తిగత జీవితంలో ఎవరికి నచ్చినట్లు వారు ఉండడంలో తప్పులేదంటూనే.. ధర్మాన్ని కాపాడుతున్నామని చెప్పుకునే బాధ్యతాయుత స్థానాల్లో ఉన్నవారు తమ ప్రవర్తన గురించి ఆలోచించుకోవాలంటూ వ్యాఖ్యానించారు. అయితే వీడియోలో ఉన్న వ్యక్తి మిశ్రా కాదని తేలడంతో దీప్కే పోస్టుపై సామాజిక మాధ్యమాల్లో విమర్శలు వెల్లువెత్తాయి. ఒక రాజకీయ సంస్థ వ్యవస్థాపకుడిగా ఉన్న వ్యక్తి వీడియో వాస్తవికతను నిర్ధారించుకోకుండా ప్రముఖ వ్యక్తికి ఆపాదిస్తూ ఎలా ప్రచారం చేస్తారని పలువురు నెటిజన్లు ప్రశ్నించారు. సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యే వీడియోలు, చిత్రాల విషయంలో బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందంటూ వ్యాఖ్యానించారు. కాగా, జితేంద్ర మిశ్రా ఇటీవల రామజన్మభూమి ట్రస్ట్ సీఈవోగా నియమితులైనట్లు కథనంలో పేర్కొన్నారు. ఆయన భారత వైమానిక దళంలో ఉన్నత స్థాయిలో సేవలందించి పదవీ విరమణ చేసిన ఎయిర్ మార్షల్ అని తెలిపింది. వీడియో నకిలీదని అంగీకరిస్తూ దీప్కే ఇచ్చిన వివరణతో వివాదం మరోసారి చర్చనీయాంశంగా మారింది.

# గ్యాస్ వినియోగదారులకు శుభవార్త

**గ్రామీణ ప్రాంతాల్లోనూ 25 రోజులకే రీఫిల్ బుకింగ్**

- పట్టణ, గ్రామీణ ప్రాంతాలకు ఒకే నియమం
- రీఫిల్ బుకింగ్ నిబంధనల్లో మార్పులు
- కేంద్రం నుంచి కీలక ఉత్తర్వులు



**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 7 (ఉద్యమ కెరటం):** వంట గ్యాస్ వినియోగదారులకు కేంద్ర ప్రభుత్వం ఊరటనిచ్చే నిర్ణయం తీసుకుంది. ఇకపై గ్రామీణ ప్రాంతాల్లోనూ ఎల్‌పీజీ సిలిండర్ రీఫిల్‌ను 25 రోజులకే బుక్ చేసుకునే అవకాశం కల్పించింది. ఇప్పటివరకు గ్రామీణ ప్రాంతాల్లో అమల్లో ఉన్న 45 రోజుల వ్యవధిని తొలగిస్తూ.. పట్టణ, గ్రామీణ ప్రాంతాలన్నింటికీ ఒకే విధంగా 25 రోజుల నిబంధనను వర్తింపజేయాలని నిర్ణయించింది. కొత్త విధానాన్ని వెంటనే అమలు చేయాలని ప్రభుత్వ రంగ చమురు సంస్థలైన ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్, భారత్ పెట్రోలియం, హిందుస్థాన్ పెట్రోలియంలకు కేంద్రం ఆదేశాలు జారీ చేసింది. దీంతో రీఫిల్ బుకింగ్ విషయంలో పట్టణ, గ్రామీణ వినియోగదారుల మధ్య ఇప్పటివరకు ఉన్న వ్యత్యాసం తొలగిపోనుంది. కేంద్ర పెట్రోలియం, సహజవాయువు శాఖ సహాయ మంత్రి సురేశ్ గోపీ సోమవారం ఈ నిర్ణయాన్ని వెల్లడించారు. దేశంలో ఎల్‌పీజీ సరఫరా పరిస్థితి మెరుగుపడటంతో పాటు పెండింగ్ రీఫిల్ బుకింగ్‌లు గణనీయంగా తగ్గాయని తెలిపారు. ఈ నేపథ్యంలో గ్రామీణ ప్రాంతాలకు అమలు చేస్తున్న 45 రోజుల నిబంధనను సడలించి 25 రోజులకు తగ్గించినట్లు పేర్కొన్నారు. పశ్చిమాసియాలో నెలకొన్న యుద్ధ పరిస్థితుల కారణంగా ఈ ఏడాది ఫిబ్రవరిలో ఎల్‌పీజీ సరఫరాపై ఒత్తిడి పెరిగిన నేపథ్యంలో కేంద్రం రీఫిల్ బుకింగ్‌పై తాత్కాలిక పరిమితులు తీసుకొచ్చింది. పట్టణ ప్రాంతాల్లో 25 రోజులు, గ్రామీణ ప్రాంతాల్లో 45 రోజుల వ్యవధిని అమలు చేసింది. ప్రస్తుతం సరఫరా పరిస్థితులు మెరుగుపడటంతో గ్రామీణ ప్రాంతాల్లోని అదనపు పరిమితిని ఎత్తివేసింది. దీంతో ఇక పట్టణమైనా.. పల్లె అయినా 25 రోజుల తర్వాతే మరో ఎల్‌పీజీ సిలిండర్ రీఫిల్ బుక్ చేసుకునేలా ఒకే నిబంధన అమల్లోకి రానుంది.

# దేశ ప్రగతికి మహిళలే మార్గదర్శకులు

- భారత చరిత్రలో వారి పాత్ర కీలకం
- లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా
- స్వాతంత్ర్య పోరాటం నుంచి దేశ నిర్మాణం వరకు చెరగని ముద్ర
- అన్ని రంగాల్లో మహిళల అద్భుత విజయాలు
- నాయకత్వ పటిమకు మరిన్ని అవకాశాలు కల్పించాలని పిలుపు
- మహిళా శాసనసభ్యులకు రెండు రోజుల ప్రత్యేక శిక్షణ



**ఫరీదాబాద్, సెప్టెంబర్ 7 (ఉద్యమ కెరటం):** భారతదేశ చరిత్ర, వారసత్వంలో మహిళలు ఎప్పుడూ మార్పునకు మార్గదర్శకులుగా నిలిచారని లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా అన్నారు. స్వాతంత్ర్య పోరాటం నుంచి దేశ నిర్మాణం వరకు ప్రతి కీలక ఘట్టంలోనూ మహిళలు చెరగని ముద్ర వేశారని కొనియాడారు. నేడు అన్ని రంగాల్లో అద్భుత విజయాలు సాధిస్తూ దేశాన్ని ప్రగతి పథంలో ముందుకు నడిపిస్తున్నారని పేర్కొన్నారు. ఫరీదాబాద్‌లో జాతీయ మహిళా కమిషన్ ఆధ్వర్యంలో మహిళా శాసనసభ్యుల కోసం నిర్వహించిన రెండు రోజుల ప్రత్యేక శిక్షణ కార్యక్రమంలో ఓం బిర్లా ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. “భారతదేశ చరిత్రలో మహిళలు ఎప్పుడూ మార్పునకు మార్గదర్శకులుగా ఉన్నారు. స్వాతంత్ర్య పోరాటం నుంచి దేశ నిర్మాణం వరకు, రాజ్యాంగ రూపకల్పన నుంచి దేశాన్ని ప్రగతి పథంలో నడిపించడం వరకు వారి పాత్ర ఎంతో విశిష్టమైనది” అని ఓం బిర్లా పేర్కొన్నారు. దేశ సంస్థాగత నిర్మాణంతో పాటు ఆధ్యాత్మిక, సాంస్కృతిక సంప్రదాయాలను పరిరక్షించడంలోనూ మహిళల సహకారం, నాయకత్వం మరువలేనిదన్నారు. ప్రస్తుత కాలంలో మహిళలు మార్పునకు ప్రతీకలుగా నిలవడమే కాకుండా వివిధ రంగాల్లో అపూర్వ విజయాలు సాధిస్తూ తమ నాయకత్వ సామర్థ్యాన్ని చాటుతున్నారని ప్రశంసించారు. మహిళల్లో సహజసిద్ధంగా ఉన్న నాయకత్వ లక్షణాలను గుర్తించి వాటిని మరింత బలోపేతం చేసేందుకు సరైన అవకాశాలు కల్పించాల్సిన బాధ్యత సమాజంపై ఉందని ఓం బిర్లా అన్నారు. మహిళా సాధికారతతో పాటు వారి సామర్థ్యాలను పెంపొందించే శిక్షణ కార్యక్రమాలు నిర్వహించడం అత్యంత ముఖ్యమని పేర్కొన్నారు. మహిళా శాసనసభ్యుల కోసం ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించిన జాతీయ మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ విజయ రాహత్కర్‌ను ఆయన అభినందించారు. ఇటువంటి కార్యక్రమాలు మహిళా ప్రజాప్రతినిధుల్లో కొత్త స్ఫూర్తిని నింపడంతో పాటు ప్రజాసేవలో మరింత సమర్థంగా పనిచేసేందుకు ఉపయోగపడతాయని చెప్పారు. ఈ శిక్షణ ద్వారా మహిళా శాసనసభ్యులు కొత్త అంశాలపై అవగాహన పెంచుకుని, తమ నియోజకవర్గాల్లో ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించగలరని ఓం బిర్లా ఆశాభావం వ్యక్తం చేశారు.

# మహిళలపై అనుచిత వ్యాఖ్యలు సహించం

**ప్రతిపక్ష డీఎంకేపై సీఎం విజయ్ తీవ్ర ఆగ్రహం.. డీఎంకే అవినీతిపై సీఎం దాడి**

**అసెంబ్లీలో పాత నివేదికల రచ్చ.. మహిళలపై అనుచిత వ్యాఖ్యలపై హెచ్చరిక**

**చెన్నై, సెప్టెంబర్ 7 (ఉద్యమ కెరటం):** తమిళనాడు శాసనసభ సాక్షిగా తమిళగ వెట్రి కజగం (టీవీకే) వ్యవస్థాపకుడు, రాష్ట్ర ముఖ్యమంత్రి సి. జోసెఫ్ విజయ్ ప్రతిపక్ష డీఎంకేపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. సోమవారం అసెంబ్లీలో పోలీసు శాఖ పద్దులపై జరిగిన చర్చకు ఆయన సమాధానమిస్తూ, డీఎంకే హయాంలో జరిగిన అవినీతి, అక్రమాలను ఆధారాలతో సహా సభ ముందుంచారు. రాజకీయ విమర్శలను ప్రజాస్వామ్యంలో స్వాగతిస్తామని, అయితే మహిళలను కించపరిచేలా అనుచిత వ్యాఖ్యలు చేస్తే మాత్రం ఉపేక్షించేది లేదని, అలాంటి వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని సభ ముఖంగా తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. డీఎంకే నాయకులు ప్రజల తీర్పును గౌరవించకపోవడం వల్లే నేడు ప్రతిపక్షంలో కూర్చోవాల్సి వచ్చిందని విజయ్ విమర్శించారు. 1977 నాటి సర్కారియా కమిషన్ నివేదికను సభలో ఉటంకించిన సీఎం విజయ్, వీరాణం పైప్‌లైన్ ప్రాజెక్టులో కమీషన్లు దండుకున్న చరిత్ర డీఎంకేదని ఆరోపించారు. మాజీ ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్, ఉదయనిధి స్టాలిన్ సహా పలువురు సీనియర్ నేతలపై ఈడీ నమోదు చేసిన ఆరోపణలను ఆయన ప్రస్తావించారు. కాంట్రాక్టులు, పార్టీ ఫండ్ల పేరుతో శాతాల వారీగా కమీషన్లు దండుకున్న దాఖలాలు రికార్డుల్లో ఉన్నాయని మండిపడ్డారు. తాను అధికారం కోసం రాజకీయాల్లోకి రాలేదని, ఎంజీఆర్, ఎన్టీఆర్ వంటి మహానాయకుల వారసత్వాన్ని స్ఫూర్తిగా తీసుకుని ప్రజలకు సేవ చేయడానికే వచ్చానని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు

# ప్రభుత్వ ఉద్యోగులకు సోషల్ మీడియా కట్టడి?

**కేంద్రం కొత్త నిబంధనలు!.. త్వరలో సోషల్ మీడియా కోడ్..**

**ఉద్యోగులందరికీ ఒకే నిబంధన.. వ్యక్తిగత ప్రచారంపై ప్రత్యేక దృష్టి**

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 7 (ఉద్యమ కెరటం):** కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు సోషల్ మీడియా వేదికలపై చేసే పోస్టులపై కట్టడి విధించేందుకు గాను ప్రత్యేకంగా ‘సోషల్ మీడియా కోడ్ ఆఫ్ కండక్ట్’ తీసుకురావాలని కేంద్ర ప్రభుత్వం భావిస్తోంది. ఇన్‌స్టాగ్రామ్, ఎక్స్, ఫేస్‌బుక్, యూట్యూబ్ వంటి వేదికల్లో ఉద్యోగుల ప్రవర్తన, పోస్టులపై పరిమితులు విధించే దిశగా కొత్త నిబంధనలు రూపొందిస్తున్నట్లు ఉన్నతాధికార వర్గాలు తెలిపాయి. ఇటీవల ప్రభుత్వ కార్యదర్శులతో జరిగిన సమావేశంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ అంశాన్ని ప్రస్తావించి, దీనిపై సమగ్రంగా అధ్యయనం చేయాలని సీనియర్ అధికారులను ఆదేశించినట్లు సమాచారం. ఈ నూతన నిబంధనలు అమల్లోకి వస్తే హోదాతో సంబంధం లేకుండా కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులందరికీ ఒకే తరహా కోడ్ వర్తిస్తుంది. ఇటీవల కాలంలో కొందరు అధికారులు యూట్యూబ్ ఛానళ్లు నడపడం, ఇన్‌స్టాగ్రామ్‌లో రీల్స్ చేయడం, అధికారిక విషయాలపై వ్యక్తిగత అభిప్రాయాలు పంచుకోవడం ఎక్కువవ్వడంపై అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. ప్రస్తుతం ఆయా శాఖల సర్వీస్ రూల్స్ మాత్రమే అమల్లో ఉండటంతో డిజిటల్ మీడియా విస్తృతికి అనుగుణంగా ఏం పోస్ట్ చేయవచ్చు, ఏం చేయకూడదు, నిబంధనలు ఉల్లంఘిస్తే ఎలాంటి క్రమశిక్షణా చర్యలు ఉంటాయనే అంశాలపై కొత్త కోడ్ ద్వారా స్పష్టత రానుంది.

## ఎం ఆర్ పి ఎస్ జాతీయ సదస్సులు



**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ టౌన్:** ఈనెల 9న వరంగల్‌లో, 10న మేడారంలో పద్మశ్రీ మందకృష్ణ మాదిగ నాయకత్వంలో ఎమ్మార్పీఎస్, ఎం ఎస్ పీ జాతీయ సదస్సులు నిర్వహించనున్నట్లు జాతీయ నాయకులు రేగుంట కేశవ్ రావు మాదిగ తెలిపారు. 9న వరంగల్‌లో జరిగే సదస్సుకు గత 30 ఏళ్లుగా ఉద్యమంలో పనిచేస్తున్న సీనియర్, నాయకులు హాజరుకావాలని కోరారు. 10న మేడారంలో జరిగే సదస్సుకు జిల్లా ఇన్చార్జ్‌లు, నాయకులు డ్రెస్ కోడ్‌తో సకాలంలో రావాలని కోరారు. ఈ రెండు సదస్సులను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు పొన్నాల నారాయణ మాదిగ, మాటూరి జయరాజ్, కొంపెల్లి రాజలింగు, గురపు సంతోష్, శిలారీ మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

## కుప్టి వంతెనకు శాశ్వత పరిష్కారం చూపాలి



**ఉద్యమ కెరటం, నేరడిగొండ:** మండలంలోని కుప్టి గ్రామం వద్ద నాలుగు వరుసల రహదారిపై ప్రమాదకర మలుపు, దెబ్బతిన్న పాత వంతెనకు శాశ్వత పరిష్కారం చూపాలని సామాజిక కార్యకర్త సాబ్లే సంతోష్ సింగ్ కోరారు. సోమవారం ప్రజావాణిలో ఎంపీడీఓ గంగాసాగర్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రమాదకర మలుపు కారణంగా గతంలో దాదాపు 50 మంది వరకు ప్రాణాలు కోల్పోయారని తెలిపారు. పాత వంతెనకు రంధ్రం ఏర్పడటంతో రాకపోకలు నిలిపివేయగా, మరో వంతెనపై ట్రాఫిక్ రద్దీ పెరిగి రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతుందన్నారు. గతంలోనే ఎమ్మెల్యే, అప్పటి ఎస్సై సంబంధిత అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లినా చర్యలు లేకపోవడం విచారికరమన్నారు. కొత్త వంతెన నిర్మాణంతో పాటు తక్షణ రహదారి భద్రతా చర్యలు చేపట్టేలా జిల్లా కలెక్టర్, ఎన్హెచ్ఏఐ , ఎస్పీ దృష్టికి సమస్యను తీసుకెళ్లాలని ఎంపీడీఓను కోరారు.

## ఆరు గ్యారంటీల అమలులో ప్రభుత్వం విఫలం



**ఉద్యమ కెరటం, కాగజ్నగర్:** ఆరు గ్యారంటీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని బీఆర్ఎస్ పార్టీ నాయకులు అన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తిచూపుతూ కాగజ్నగర్లో సోమవారం సబ్కలెక్టర్ కార్యాలయ ఏఓకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారంటీలు, ఇతర హామీల అమలులో జాప్యం కారణంగా ప్రజల్లో అసంతృప్తి నెలకొందని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో తాగునీరు, రహదారులు, డ్రైనేజీ వంటి మౌలిక వసతుల సమస్యలు తీవ్రంగా ఉన్నాయని తెలిపారు. రైతులకు సాగునీరు, ఎరువులు సక్రమంగా అందడం లేదని ఆరోపించారు. సంక్షేమ పథకాల అమలు, అర్హుల ఎంపికలో జాప్యం జరుగుతోందని, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులను కోరారు. ప్రభుత్వం ప్రజా సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు గేలేం వెంకటేష్, పార్వతి అంజన్న, మినాజ్, బట్టుపల్లి సర్పంచ్ రాజేందర్, నజీమ్, వాసు, రాజేష్, కరీం, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలలలో విద్యా ప్రమాణాలు పెంపొందించేందుకు 'విద్య ప్లస్'

- **జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యువరాజ్ మర్మాట్**



**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ :** జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలను మార్చడంతో పాటు విద్యా ప్రమాణాలను మరింత మెరుగుపరిచేందుకు చేపట్టిన విద్య ప్లస్ పైలట్ ప్రాజెక్ట్ పకడ్బందీగా అమలు చేసేందుకు చర్యలు చేపడుతున్నామని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యువరాజ్ మర్మాట్ తెలిపారు. ఎస్ ఐ ఆర్ 2026 లో భాగంగా జిల్లాకు విచ్చేసిన రాష్ట్ర విద్యాశాఖ కార్యదర్శి, ప్రత్యేక సమగ్ర సవరణ పరిశీలకురాలు యోగితరాణా కు విద్యా ప్లస్ పై వివరణాత్మక సమీక్షా నివేదికను సమర్పించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలలలో సాంకేతికత ఆధారిత, ప్రామాణికమైన, రియల్ టైమ్ పర్యవేక్షణతో కూడిన బోధనా వ్యవస్థను అందుబాటులోకి తీసుకురావడమే 'విద్య ప్లస్' పైలట్ ప్రాజెక్ట్ ప్రధాన ఉద్దేశమని తెలిపారు. విద్యార్థుల అభ్యసన సామర్థ్యాన్ని గుర్తించి, అవసరమైన మేరకు బోధనా విధానాలలో మార్పులు తీసుకురావడం ద్వారా మెరుగైన విద్యా ఫలితాలు సాధించేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతుందని తెలిపారు. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలలో 5 నుంచి 10వ తరగతి విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించి వారి విద్యా నైపుణ్యాలను మెరుగుపరిచేందుకు ప్రత్యేక కార్యాచరణ అమలు, డిజిటల్ పరికరాలు అందుబాటులో లేని విద్యార్థుల కోసం ప్రింటెడ్ క్యూ.ఆర్./ఆర్కో కార్డుల ద్వారా మూల్యాంకనం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. విద్యార్థులు ప్రశ్నలకు అనుగుణంగా ఎ ,బి, సి, డి సమాధాన కార్డులను ప్రదర్శించగా, ఉపాధ్యాయులు వెబ్ కామ్ ద్వారా వాటిని స్కాన్ చేసి ఫలితాలను తక్షణమే నమోదు చేసే విధానం అమలు చేయడం జరుగుతుందని, తరగతి గదులలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత బోధనా సహాయక వ్యవస్థను వినియోగించి పాఠ్యాంశాల సారాంశం, విద్యార్థుల సందేహాల నివృత్తి, సంబంధిత వీడియోలు, సిమ్యులేషన్లను అందుబాటులోకి తీసుకురావడం జరుగుతుందని, తద్వారా విద్యార్థుల్లో ఆసక్తి, అవగాహన పెంపొందించేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలలో ఒకే విధమైన అధ్యయన ప్రణాళికను అమలు చేయడం ద్వారా విద్యార్థుల మధ్య ఉన్న అభ్యసన అంతరాలను తగ్గించి, అందరికీ సమానమైన విద్యా అవకాశాలు కల్పించేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. పాఠశాలలలో రోజువారీ బోధనా కార్యక్రమాలు, ఉపాధ్యాయుల హాజరు, విద్యార్థుల అభ్యసన స్థాయి, విద్యా ప్రతిభ తదితర అంశాలను నిరంతరం పర్యవేక్షించేందుకు ప్రత్యేక రియల్ టైమ్ డాష్‌బోర్డ్‌ను ఏర్పాటు చేయడం ద్వారా అవసరమైన చోట తక్షణమే చర్యలు తీసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలలో నాణ్యమైన విద్యను అందించడంతో పాటు విద్యార్థుల అకాడమిక్ ప్రతిభను పెంపొందించేందుకు 'విద్య ప్లస్' పైలట్ ప్రాజెక్ట్ కీలకంగా దోహదపడుతుందని తెలిపారు.



## స్పీకర్పై అనుచిత వ్యాఖ్యలు ప్రజాస్వామ్యానికే అవమానం

- **తాతా మధు వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని క్షమాపణ చెప్పాలి**
- **ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్**

**ఉద్యమ కెరటం, సత్తుపల్లి:** తెలంగాణ శాసనసభ స్పీకర్పై ఎమ్మెల్సీ తాతా మధు చేసిన అనుచిత వ్యాఖ్యలను సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ తీవ్రంగా ఖండించారు. రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉన్న స్పీకర్ను కించపర్చేలా మాట్లాడటం ప్రజాస్వామ్య విలువలను అవమానించడమేనని అన్నారు. స్పీకర్ పదవి ఏ ఒక్క పార్టీకి, వ్యక్తికి సంబంధించినది కాదని, అది శాసనసభ గౌరవానికి, ప్రజాస్వామ్య వ్యవస్థకు ప్రతీక అని పేర్కొన్నారు. రాజకీయ విభేదాలు సహజమే అయినప్పటికీ, రాజ్యాంగబద్ధమైన పదవుల గౌరవాన్ని దెబ్బతీసేలా వ్యక్తిగత దూషణలు, అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. ప్రజాప్రతినిధులు బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ రాజ్యాంగ వ్యవస్థల పట్ల గౌరవం కలిగి ఉండాలని సూచించారు. స్పీకర్ను అవమానించడం అంటే శాసనసభ గౌరవాన్ని, ప్రజాస్వామ్య వ్యవస్థను అవమానించడమేనని స్పష్టం చేశారు. ఎమ్మెల్సీ తాతా మధు తన వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకుని తెలంగాణ శాసనసభ స్పీకర్కు బహిరంగంగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.



## ప్రజావాణి దరఖాస్తులను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలి

**జిల్లా కలెక్టర్ రాజర్షి షా**



**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** ప్రజావాణి దరఖాస్తులను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి అర్జీలను స్వీకరించి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజావాణికి వచ్చే ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి, నిబంధనల మేరకు నిర్ణీత గడువులోగా సత్వరమే పరిష్కరించాలని సూచించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ మండలాల వారీగా పెండింగ్లో ఉన్న ప్రజావాణి దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి సారించి, ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు. ప్రజావాణిలో విద్య, వైద్యం, ఇందిరమ్మ ఇళ్లు, పింఛన్లు, భూ సమస్యలు తదితర అంశాలకు సంబంధించిన దరఖాస్తులు అందాయి. ప్రతి అర్జీని పరిశీలించి, అర్హతలు, ప్రభుత్వ నిబంధనల మేరకు బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దరఖాస్తుల పరిష్కారంలో జాప్యం, నిర్లక్ష్యాన్ని సహించేది లేదని స్పష్టం చేశారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే ప్రభుత్వ అధికారుల ప్రధాన బాధ్యత అని పేర్కొన్నారు. అనంతరం సీఈఓగా పదోన్నతి పొందిన డీఆర్డీఓ పీడీ రవీందర్ రాథోడ్ను కలెక్టర్ శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు ఆర్ఎస్.చిత్రా, రాజేశ్వర్, డీఆర్ఓ స్రవంతి, వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## ఎస్ఐఆర్ ప్రక్రియను వేగవంతం చేయాలి

**జిల్లా కలెక్టర్ రాజర్షి షా**

**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** జిల్లాలో ఎస్ఐఆర్ ప్రక్రియను మరింత వేగవంతం చేసి, పెండింగ్లో ఉన్న దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. సోమవారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర సీఈఓ సుదర్శన్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల డిఈఓలు, ఈఆర్వోలతో ఎస్ఐఆర్ పై సమీక్ష నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో కలెక్టరేట్ వీసీ హాల్ నుంచి అధికారులతో కలిసి హాజరైన ఎన్నికల అధికారి, కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో అందిన మొత్తం 1లక్ష 50వేల నోటీసుల్లో ఇప్పటివరకు 60వేల నోటీసులు పరిష్కరించడం జరిగిందని తెలిపారు. ఆదిలాబాద్ నియోజకవర్గంలో, ముఖ్యంగా అర్బన్ ప్రాంతంలో ఎక్కువ పెండింగ్లు ఉన్నందున ప్రత్యేక దృష్టి పెట్టామని, అనామలీస్ సంబంధిత అంశాలపై ప్రత్యేకంగా దృష్టి సారించి క్లియర్ చేస్తున్నట్లు పేర్కొన్నారు. డాక్యుమెంట్ అప్లోడింగ్, హియరింగ్ లాప్స్, దరఖాస్తుల సేకరణను ముమ్మరం చేస్తున్నామని అన్నారు. డేటాఎంట్రీ ఆపరేటర్ల వద్ద కేవలం 99 పెండింగ్లు మాత్రమే ఉన్నాయని, వాటిని త్వరలోనే పూర్తి చేస్తామన్నారు. నిర్దేశిత మార్గదర్శకాల ప్రకారం ప్రత్యేక క్యాంపెయిన్ రోజులను విజయవంతంగా నిర్వహిస్తున్నామని, రాబోయే రోజుల్లోనూ ఇది కొనసాగుతుందని పేర్కొన్నారు. అనంతరం




కలెక్టర్ అధికారులతో ఎస్ఐఆర్ పై సమీక్షించి ప్రక్రియ వేగంవతంగా పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్లో అదనపు కలెక్టర్లు ఆర్ఎస్.చిత్రా, ఎస్.రాజేశ్వర్, డిఆర్ఓ స్రవంతి, ఆర్డీఓ జగదీశ్వర్ రావు, ఎన్నికల విభాగం పర్యవేక్షకురాలు నలంద ప్రియా, పట్టణ తహశీల్దార్ శ్రీనివాస్, నాయబ్ తహశీల్దార్లు, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రజావాణి దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి

• జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎం.డేవిడ్

**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ టౌన్:** ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరగా పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎం.డేవిడ్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సముదాయంలో గల ఎన్ఐసి సమావేశ మందిరంలో జిల్లా రెవెన్యూ అధికారి దాసరి వేణు తో కలిసి అర్జీదారుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. జైనూర్ మండలం ఊషేగం గ్రామానికి చెందిన జయ కళాబాయి తనకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని కోరుతూ అర్జీ సమర్పించారు. కాగజ్ నగర్ మండలం కోయవాగు గ్రామానికి చెందిన కాంపెల్లి అరుణ తనకు ఒంటరి మహిళ పింఛన్ మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. రెబ్బెన మండలం వంకులం గ్రామానికి చెందిన జూపాక పోచం తన పేరిట గల పట్టా భూమిని ఆన్ లైన్ లో నమోదు చేయాలని కోరుతూ అర్జీ సమర్పించారు. చింతలమానేపల్లి మండలం బూరేపల్లి గ్రామానికి చెందిన జాడి భగవాన్ తనకు చెందిన పట్టా భూమిని వేరొకరి పేరిట నమోదైనందున అట్టి పేరును సవరించి తన పేరిట నమోదు చేసి పట్టా పాసు పుస్తకం ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. కాగజ్ నగర్ మండలం అంకుశాపూర్ గ్రామానికి చెందిన నగోషా యమునబాయి తనకు వితంతు పింఛన్ మంజూరు చేయాలని కోరుతూ అర్జీ సమర్పించారు. రెబ్బెన మండలం గోలేటి టౌన్షిప్ కు చెందిన గుండేటి స్వరూప తనకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. జైనూర్ మండలం ఊషేగాం గ్రామానికి చెందిన కోవ కమలాబాయి



తనకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరగా పరిష్కరించే విధంగా అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, అర్జీదారులు పాల్గొన్నారు.

# సివిక్స్ అధ్యాపకుడి కోసం విద్యార్థుల ధర్నా



**ఉద్యమ కెరటం, సత్తుపల్లి:** వేంసూర్ మండలం కందుకూరులోని బండి సోమకాంతం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సివిక్స్ అధ్యాపకుడిని నియమించాలని డిమాండ్ చేస్తూ విద్యార్థులు సోమవారం ఆందోళన చేపట్టారు. కళాశాల ఎదుట రహదారిపై బైఠాయించి ధర్నా నిర్వహించారు. 2023లో కళాశాల ప్రారంభమైనప్పుడు ప్రిన్సిపాల్తో పాటు ఒక ఫిజిక్స్ లెక్చరర్ మాత్రమే ఉండేవారని తెలిపారు. అనంతరం జువాలజీ, తెలుగు, ఎకనామిక్స్ విభాగాలకు అధ్యాపకులను నియమించినప్పటికీ, సివిక్స్కు మాత్రం ఇప్పటికీ అధ్యాపకుడు లేకపోవడంతో చదువులు దెబ్బతింటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కళాశాలలో ప్రస్తుతం సుమారు పది మంది బోధన సిబ్బంది ఉన్నప్పటికీ సివిక్స్ అధ్యాపకుడు లేకపోవడంతో ఆ సబ్జెక్టు చదువుతున్న విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. వెంటనే అధ్యాపకుడిని నియమించి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యపై విద్యా శాఖ ఉన్నతాధికారులకు వినతిపత్రం అందజేస్తామని పేర్కొన్నారు. అధికారులు స్పందించి తక్షణ చర్యలు తీసుకోకపోతే ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

# బీఆర్ఎస్ నేతల అరెస్టుపై సత్తుపల్లిలో నిరసన

• సండ్ర వెంకట వీరయ్య ఆధ్వర్యంలో భారీ ర్యాలీ



**ఉద్యమ కెరటం, సత్తుపల్లి:** తెలంగాణ అసెంబ్లీ వద్ద బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను పోలీసులు అడ్డుకోవడం, పలువురు నేతలను అదుపులోకి తీసుకోవడాన్ని నిరసిస్తూ సత్తుపల్లిలో బీఆర్ఎస్ శ్రేణులు సోమవారం భారీ ఆందోళన చేపట్టాయి. మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు సండ్ర వెంకట వీరయ్య ఆధ్వర్యంలో నల్ల కండువాలు, నల్ల జెండాలతో నిరసన ర్యాలీ నిర్వహించారు. జీవీ మాల్ నుంచి అంబేద్కర్ సెంటర్ వరకు సాగిన ర్యాలీలో మహిళలు, నాయకులు, కార్యకర్తలు, పార్టీ అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సండ్ర వెంకట వీరయ్య మాట్లాడుతూ అసెంబ్లీకి నల్ల టీషర్టులతో వెళ్లిన బీఆర్ఎస్ నేతలు కేటీఆర్, హరీశ్రావు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్తో పాటు ఇతర ప్రజాప్రతినిధులను పోలీసులు అడ్డుకోవడం, పలువురిని అదుపులోకి తీసుకోవడం ప్రజాస్వామ్య హక్కులను అణచివేయడమేనని విమర్శించారు. ప్రజా సమస్యలను ప్రశ్నించడం ప్రతిపక్ష హక్కు అని, ప్రశ్నించే గొంతును అణచివేయడం సరికాదని మండిపడ్డారు. మహిళా ఎమ్మెల్యేల పట్ల పోలీసులు వ్యవహరించిన తీరుపై అభ్యంతరం వ్యక్తం చేశారు. పార్లమెంట్లో నల్ల దుస్తులతో నిరసన తెలిపే హక్కు ఉన్నప్పుడు అసెంబ్లీలో బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులకు అదే హక్కు ఎందుకు ఉండకూడదని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులు పూర్తవుతున్నా ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారంటీలు, 13 డిక్లరేషన్లు, 420 హామీల అమలుపై ప్రజల్లో అనేక ప్రశ్నలు ఉన్నాయని తెలిపారు. మహిళలకు నెలకు రూ.2,500 ఆర్థిక సాయం, యువతకు ఉద్యోగాలు, నిరుద్యోగ భృతి, మెగా డీఎస్సీ, జాబ్ క్యాలెండర్, విద్యార్థులకు స్కూటర్లు, కల్యాణలక్ష్మి–షాదీ ముబారక్ కింద తులం బంగారం, అర్హులైన పేదలకు ఇళ్ల వంటి హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం బీఆర్ఎస్ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. అనంతరం ప్రజల నుంచి స్వీకరించిన వివిధ సమస్యలపై వినతి పత్రాలను ప్రజావాణి కార్యక్రమంలో అధికారులకు సమర్పించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, మహిళా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# తాతా మధును శాసన మండలి నుంచి బహిష్కరించాలి

**ఉద్యమ కెరటం, నేరడిగొండ:** తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు చేసిన అనుచిత వ్యాఖ్యలను కాంగ్రెస్ జిల్లా అధికార ప్రతినిధి పసుల చంటి తీవ్రంగా ఖండించారు. తాతా మధుపై తక్షణమే చర్యలు తీసుకుని శాసన మండలి నుంచి బహిష్కరించాలని డిమాండ్ చేశారు. సోమవారం బోథ్ మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. స్పీకర్ పదవికి గౌరవం ఇవ్వలేని వ్యక్తికి శాసన మండలి సభ్యుడిగా కొనసాగేందుకు



నైతిక హక్కు లేదన్నారు. అధికార, ప్రతిపక్ష పార్టీలు రాజ్యాంగబద్ధమైన వ్యవస్థలను గౌరవించాల్సిన బాధ్యత ఉందని తెలిపారు. ప్రజాస్వామ్యంలో ప్రభుత్వ విధానాలపై విమర్శలకు అవకాశం ఉన్నప్పటికీ, వ్యక్తిగత దూషణలు, అనుచిత భాషకు స్థానం లేదని స్పష్టం చేశారు. తాతా మధు చేసిన వ్యాఖ్యలపై బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, తాతా మధు స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్తో పాటు దళిత సమాజానికి బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. అలాగే తాతా మధు, కేటీఆర్, హరీశ్ రావులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసులు నమోదు చేయాలని కోరారు.

# బెల్లంపల్లిలో బీఆర్ఎస్ రాస్తారోకో

**ఉద్యమ కెరటం, తాండూర్:** అసెంబ్లీలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై జరిగిన దాడిని నిరసిస్తూ బెల్లంపల్లి పట్టణంలో బీఆర్ఎస్, బీఆర్ఎస్వీ నాయకులు సోమవారం రాస్తారోకో నిర్వహించారు. రాస్తారోకో చేస్తున్న నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకుని బెల్లంపల్లి నుంచి మాదారం పోలీస్ స్టేషన్కు తరలించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్వీ జిల్లా అధ్యక్షుడు బడికల శ్రావణ్, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ బత్తుల సుదర్శన్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యబద్ధంగా నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులను పోలీసులు అరెస్ట్ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. ప్రజా సమస్యలను అసెంబ్లీలో ప్రస్తావిస్తున్న ప్రతిపక్ష ఎమ్మెల్యేలపై దాడి చేయడం, దానిని ప్రశ్నిస్తూ శాంతియుతంగా నిరసన తెలిపిన నాయకులను అరెస్ట్ చేయడం కాంగ్రెస్ ప్రభుత్వ అణచివేత ధోరణికి నిదర్శనమని విమర్శించారు. అసెంబ్లీలో ఎమ్మెల్యేలపై దాడి చేస్తే తప్పు కాదు.. దాన్ని ప్రశ్నిస్తే మాత్రం అరెస్టా.. అని ప్రశ్నించారు. అరెస్టులు, కేసులు, బెదిరింపులతో బీఆర్ఎస్, బీఆర్ఎస్వీ నాయకులను భయపెట్టలేరని స్పష్టం చేశారు. అక్రమ అరెస్టులకు భయపడేది లేదని, పోలీసు కేసులకు వెనక్కి తగ్గేది లేదని అన్నారు. అరెస్టులతో ఉద్యమాన్ని



అణచివేయడం సాధ్యం కాదని, భవిష్యత్లో మరింత ఉధృతంగా పోరాటాలు చేపడతామని పేర్కొన్నారు. అరెస్టయిన వారిలో బీఆర్ఎస్ బెల్లంపల్లి పట్టణ అధ్యక్షుడు నూనెటి సత్యనారాయణ, నాయకులు మద్దెల గోపికృష్ణ, రెవెల్లి విజయ్, సబ్బని అరుణ్, ఎరుకాల సుందర్ రావు, ధర్మేందర్ తదితరులు ఉన్నారు.

# బీజేపీ నాయకుల ముందస్తు అరెస్ట్

**ఉద్యమ కెరటం, తాండూర్:** అసెంబ్లీ ముట్టడికి వెళ్తున్న బీజేపీ జిల్లా కార్యదర్శి రామగౌని మహీధర్ గౌడ్ తో పాటు బీజేపీ నాయకులను మాదారం పోలీసులు సోమవారం ముందస్తుగా అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్ కు తరలించారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా కార్యదర్శి మాట్లాడుతూ ప్రజాస్వామ్య పద్ధతిలో నిరసన తెలిపేందుకు వెళ్తున్న నాయకులను ముందస్తుగా అరెస్ట్ చేయడం దారుణమని అన్నారు. ఇది ప్రజాస్వామ్య హక్కులను అణచివేయడమేనని తీవ్రంగా ఖండించారు.



# గోశాల, వేద పాఠశాలకు స్థలం కేటాయించాలి

**ఉద్యమ కెరటం, తాండూర్:** గోశాల, వేద పాఠశాల, యజ్ఞశాల, వేద గాయత్రీ మాత ఆలయ నిర్మాణం కోసం స్థలం కేటాయించాలని బెల్లంపల్లి బ్రాహ్మణ సేవా సమితి నాయకులు కోరారు. సోమవారం ప్రజావాణిలో మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్కు వినతిపత్రం సమర్పించారు. బ్రాహ్మణ సేవా సమితి అధ్యక్షుడు వివిఎల్ఎస్. శ్రీనివాసరావు మాట్లాడుతూ బెల్లంపల్లి మండలంలో 300కు పైగా బ్రాహ్మణ కుటుంబాలు నివసిస్తున్నాయని తెలిపారు. వివిధ కార్యక్రమాలు నిర్వహించేందుకు ప్రత్యేక స్థలం లేక



ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని పేర్కొన్నారు. సంఘం ఆధ్వర్యంలో గోశాల, వేద పాఠశాల, యజ్ఞశాల, వేద గాయత్రీ మాత ఆలయం నిర్మించాలని సంకల్పించినట్లు తెలిపారు. ఈ విషయమై గతంలో మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య, ప్రస్తుత ఎమ్మెల్యే గడ్డం వినోద్లకు వినతిపత్రాలు అందజేసినట్లు పేర్కొన్నారు. ప్రభుత్వం స్పందించి అనువైన స్థలాన్ని కేటాయించాలని కోరారు. సానుకూలంగా స్పందించిన కలెక్టర్ ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఎస్ఎస్ ప్రత్యేక సలహాదారు కొమ్మెర లక్ష్మణ్, సభ్యులు జగన్మోహన్, మనోజ్ పాండే, చిమిరాల శ్రీనివాస్, దత్తాత్రేయరావు, సత్యనారాయణ, మహేష్ శర్మ, భజరంగ్ కొలరియా తదితరులు పాల్గొన్నారు.

# 420 హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం




**ఉద్యమ కెరటం, తాండూర్:** కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రకటించిన ఆరు గ్యారంటీలు, 420 హామీల అమలులో విఫలమైందని తాండూర్ మండల బీఆర్ఎస్ నాయకులు ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వ వెయ్యి రోజుల పాలన వైఫల్యాలకు నిరసనగా బెల్లంపల్లి మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య పిలుపు మేరకు సోమవారం తాండూర్ ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో నాయకులు అధికారులకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన ఆరు గ్యారంటీలు, 420 హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని విమర్శించారు. హామీలను అమలు చేసి ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ తాండూర్ మండల అధ్యక్షుడు ఎస్.దత్తుమూర్తి, సీనియర్ నాయకులు మంగపతి సురేష్ బాబు, ఎలుక రామచందర్, బోనగిరి చంద్రశేఖర్, మాసాడి శ్రీరాములు, గట్టు సంతోష్ కుమార్, జాడి పోషం, అడ్వాల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# పేదల సొంతింటి కల నెరవేర్చడమే ప్రభుత్వ లక్ష్యం

**ఉద్యమ కెరటం, గంభీరావుపేట:** పేదల సొంతింటి కల నెరవేర్చడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని ఆ పార్టీ నాయకులు అన్నారు. గంభీరావుపేట మండలంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి సోమవారం భూమిపూజ కార్యక్రమాలు నిర్వహించారు. పల్లె కవిత–శ్రీనివాస్ దంపతులకు మంజూరైన ఇందిరమ్మ ఇంటి నిర్మాణ పనులకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారుల కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ పేదల సొంతింటి కలను నెరవేర్చడమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అన్నారు. అర్హత కలిగిన ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు అందేలా ప్రభుత్వం చర్యలు చేపడుతోందని తెలిపారు. పేదల ఆర్థిక పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని సొంతింటి కలను సాకారం చేసుకునేందుకు ప్రభుత్వం అండగా నిలుస్తోందన్నారు. గత ప్రభుత్వ హయాంలో నిజమైన లబ్ధిదారులకు డబుల్ బెడ్రూమ్ ఇళ్లు పూర్తిస్థాయిలో అందలేదని ఆరోపించారు. ప్రస్తుతం అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా ప్రభుత్వం సహకారం అందిస్తోందని



పేర్కొన్నారు. ఇంటి నిర్మాణ సమయంలో లబ్ధిదారులకు అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ రాజేందర్, మాజీ జెడ్పీటీసీ మల్లు నర్సాగౌడ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నిమ్మల తిరుపతి గౌడ్, పర్ష హనుమాన్లు, ఈవో వినీల్ రెడ్డి, ఇందిరమ్మ ఇళ్ల కమిటీ సభ్యులు హమీద్, లక్కం నాంపల్లి, వేషాల వెంకటి, దేశెట్టి శేఖర్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

# హావల్దార్ కుంరం కొద్దుకు కాంగ్రెస్ నేత నివాళి




**ఉద్యమ కెరటం, కెరమెరి:** మండలంలోని జోడేఘాట్ ప్రాంతానికి చెందిన హవల్దార్ కుంరం కొద్దు ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. సోమవారం నిర్వహించిన పెద్దకర్మ కార్యక్రమానికి కెరమెరి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మహమ్మద్ సుజాయిత్ ఖాన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా కుంరం కొద్దు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. కుంరం కొద్దు మృతి కుటుంబ సభ్యులు, బంధుమిత్రులకు తీరని లోటని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సిడం జగన్నాథ్ రావు, రాథోడ్ దేవిదాస్, అయ్యుబ్ ఖాన్, మడవి రాజు, కుటుంబ సభ్యులు కుంరం మారుతి, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

## బాలికల హాస్టల్ భవనం నిర్మించాలి




**ఉద్యమ కెరటం, జైనూర్:** జైనూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో బాలికల కోసం శాశ్వత హాస్టల్ భవనంతో పాటు ప్రహరీ నిర్మించాలని పవర్గూడ సర్పంచ్ రాజేందర్ కోరారు. సోమవారం ప్రజావాణిలో ఎంపీడీఓ కృష్ణవేణికు దరఖాస్తు అందజేశారు. కళాశాలలో 350 మందికి పైగా విద్యార్థులు చదువుతున్నారని తెలిపారు. లింగాపూర్, సిర్పూర్(యు), జైనూర్ మండలాల నుంచి విద్యార్థులు 15 నుంచి 20 కిలో మీటర్ల దూరం ప్రయాణించి కళాశాలకు వస్తున్నారని పేర్కొన్నారు. బాలికల వసతి సమస్యను దృష్టిలో ఉంచుకుని కళాశాల ఆవరణలో శాశ్వత హాస్టల్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరారు. అలాగే కళాశాల చుట్టూ ప్రహరీ నిర్మించి విద్యార్థులకు భద్రత కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

## గుడిహత్నూర్ ట్రాఫిక్ కష్టాలపై కలెక్టర్కు వినతి



**ఉద్యమ కెరటం, గుడిహత్నూర్:** గుడిహత్నూర్ మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై నెలకొన్న తీవ్ర ట్రాఫిక్ సమస్యలు, వరుస ప్రమాదాల నివారణకు శాశ్వత పరిష్కారం చూపాలని సర్పంచ్ ఆడే శీల కోరారు. సోమవారం ప్రజావాణిలో జిల్లా కలెక్టర్ తో పాటు జిల్లా పంచాయతీ అధికారికి వినతిపత్రం సమర్పించారు. మండల కేంద్రంలో ట్రాఫిక్ ఇబ్బందులతో ప్రజలు తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం కల్పించడంతో పాటు గ్రామంలో పెండింగ్లో ఉన్న అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని కోరారు. గ్రామ ప్రథమ పౌరురాలిగా ప్రజా సమస్యలను పరిష్కరించడమే తన కర్తవ్యమని, సమస్యల పరిష్కారం కోసం ఎంతటి పోరాటానికైనా సిద్ధంగా ఉన్నానని స్పష్టం చేశారు. సర్పంచ్ వినతిపై జాయింట్ కలెక్టర్ స్పందిస్తూ తాము సైతం విధి నిర్వహణకు ప్రయాణిస్తున్న సమయంలో గుడిహత్నూర్ ట్రాఫిక్లో సుమారు రెండు గంటల పాటు వేచిచూడాల్సి వచ్చిందని గుర్తుచేశారు. సమస్య తీవ్రతను పరిశీలించి త్వరితగతిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రజా సమస్యల పరిష్కారంపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్న సర్పంచ్ ఆడే శీలను జాయింట్ కలెక్టర్ అభినందించారు.

# హియరింగ్ ప్రక్రియ వేగవంతం చేయాలి

- ప్రత్యేక సమగ్ర సవరణ పరిశీలకురాలు డా. యోగితా రాణా




**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ :** జిల్లాలో చేపడుతున్న ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణలో భాగంగా హియరింగ్ ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాలని, నోటీసులు జారీ వేగవంతం చేయాలని ప్రత్యేక సమగ్ర సవరణ పరిశీలకురాలు డా. యోగితా రాణా అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ కె.హరిత, అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యువరాజ్ మర్మాట్, కాగజ్ నగర్ సబ్ కలెక్టర్ హర్మ చౌదరి, ఆసిఫాబాద్ రాజస్వ మండల అధికారి లోకేశ్వర్ రావు, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ జాస్టిన్ జోల్ లతో కలిసి తహసిల్దార్లతో హియరింగ్ ప్రక్రియ, నోటీసుల జారీ పురోగతిపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక సమగ్ర సవరణ పరిశీలకురాలు మాట్లాడుతూ మ్యాపింగ్ కాని, అనమలిస్ జాబితాలో గల ఓటర్లకు నోటీసులు త్వరగా జారీ చేసి హియరింగ్ ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాలని తెలిపారు. అనమలిస్ జాబితాలో చిన్న చిన్న సవరణలను వెంటనే పూర్తి చేయాలని తెలిపారు. బూత్ స్థాయి అధికారులు సంబంధిత ఓటరుకు నోటీసును అందజేసి రసీదు తీసుకోవాలని తెలిపారు. సమర్పించవలసిన ధృవపత్రాలను ముందే సిద్ధం చేసుకోవాలని, బూత్ స్థాయి అధికారులకు అవగాహన కల్పించాలని, 100 శాతం హియరింగ్ హాజరై ధ్రువపత్రాలు సమర్పించేలా కార్యాచరణ చేపట్టాలని తెలిపారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో హియరింగ్ చేపట్టాలని, అవసరమైన నివాస, కుల ధ్రువపత్రాలను అదే రోజు జారీ చేసేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ భారత ఎన్నికల సంఘం కార్యాచరణ ప్రకారం హియరింగ్ ప్రక్రియను పూర్తి చేస్తామని తెలిపారు. ధ్రువ పత్రాలను ఏ రోజుకు అదే రోజు జారీ చేసేలా ఇప్పటికే తహసిల్దార్లను ఆదేశించడం జరిగిందని, ప్రతి పోలింగ్ కేంద్రంలో హియరింగ్ ప్రక్రియ నిర్వహిస్తామని తెలిపారు. ఎస్ ఐ ఆర్ ప్రక్రియలో రాజకీయ పార్టీల సహకారం తీసుకుంటున్నామని, ఎన్నికల సంఘం ఆదేశాల ప్రకారం ప్రక్రియ పూర్తి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ సవరణ ప్రక్రియలో భాగంగా హియరింగ్



**ఉద్యమ కెరటం, నేరడిగొండ:** ఎస్ఐఆర్ సవరణ ప్రక్రియలో భాగంగా సోమవారం మండలంలోని వాగ్దారి గ్రామంలో హియరింగ్ నిర్వహించారు. ఓటర్లకు జారీ చేసిన నోటీసులకు సంబంధించిన ధృవ పత్రాలను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ గంగాసాగర్ రెడ్డి మాట్లాడుతూ ఎస్ఐఆర్ సవరణ ప్రక్రియ అనేది పారదర్శకంగా, అర్హులైన ఓటర్లు తప్పి పోకుండా నిర్వహించడం జరుగుతుందన్నారు. నోటీసులు అందుకున్న ప్రతి ఓటరు తప్పనిసరిగా తమకు సంబంధించిన సరైన ధృవ పత్రాలను సమర్పించాలని సూచించారు. ఎలాంటి అపోహలకు గురికావద్దని, అధికారులకు సహకరించాలని కోరారు. ఓటరు జాబితాలో తప్పులు, డబుల్ ఎంట్రీలు, మృతిచెందిన వారి పేర్ల తొలగింపు వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించామని తెలిపారు. గ్రామంలోని ప్రతిఒక్కరూ తమ ఓటు హక్కును సక్రమంగా వినియోగించుకునేలా చూడటమే ఈ ప్రక్రియ ముఖ్య ఉద్దేశమని అన్నారు. తప్పుడు పత్రాలు సమర్పించినా, సమాచారం దాచినా చట్టపరమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్, ఉప సర్పంచ్ సోయం లక్ష్మణ్, బీఎల్ఓ సూపర్ వైజర్ శంకర్, గ్రామ పరిపాలన అధికారి ఆడెపు రాజారాం, పంచాయతీ కార్యదర్శి నవీన్, వార్డు మెంబర్లు, గ్రామ పెద్దలు, బీఎల్ఓలు తదితరులు పాల్గొన్నారు.

# మార్కెట్ అభివృద్ధికి చర్యలు

- ఏఎంసీ పాలకవర్గ సమావేశంలో చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి



**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** మార్కెట్ అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నట్లు ఆదిలాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో ఏఎంసీ పాలకవర్గ సమావేశం నిర్వహించారు. గత పాలకవర్గ సమావేశ తీర్మానాలను చదివి వినిపించి వాటిపై చర్చించారు. ఇటీవల మృతి చెందిన మార్కెట్ డైరెక్టర్ మోతిబాయి చిత్రపటానికి నివాళులర్పించి సంతాపం తెలిపారు. అనంతరం చైర్మన్ మాట్లాడుతూ 2026-27 సంవత్సరానికి వ్యవసాయ మార్కెట్ యార్డులోని ఎలక్ట్రిక్ వే బ్రిడ్జి మరమ్మతుల కోసం సీల్డ్ టెండర్లు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. టెండర్ ఫారాలను ఈనెల 7 నుంచి 15న సాయంత్రం 5గంటల వరకు పొందవచ్చన్నారు. పూర్తి చేసిన టెండర్లను 16న మధ్యాహ్నం 2 గంటలలోపు సమర్పించాలని సూచించారు. అదేరోజు సాయంత్రం 4 గంటలకు టెండర్లు తెరవనున్నట్లు పేర్కొన్నారు. మార్కెట్ అభివృద్ధిలో భాగంగా కాంపౌండ్ వాల్, సోలార్ ఫెన్సింగ్, సీసీ కెమెరాలు, ఆర్వో వాటర్ ప్లాంట్, యార్డు క్లీనింగ్, మాయిశ్చర్ మీటర్లు, 200 తాడిపత్రులు ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. మార్కెట్ సమస్యలు, రైతుల ఇబ్బందులపై ప్రత్యేక దృష్టి సారించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని అన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ చైర్మన్ బండారి అనూష సతీష్, మార్కెట్ సెలెక్షన్ గ్రేడ్ కార్యదర్శి విఠల్, వైస్ చైర్మన్ తన్వీర్ అహ్మద్, పీఏసీ చైర్మన్ మేస్త్రం పరమేశ్వర్, పాలకవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# స్వయం ఉపాధిలో యువత ముందుండాలి

### జైనూర్లో మిల్క్ హబ్ ప్రారంభం



**ఉద్యమ కెరటం, జైనూర్:** యువత ఉద్యోగాల కోసం ఎదురుచూడకుండా స్వయం ఉపాధి వైపు అడుగులు వేయాలని మార్కెట్ కమిటీ చైర్మన్ కుడ్మేత విశ్వనాథ్ రావు, స్థానిక సర్పంచ్ కొడప ప్రకాష్ అన్నారు. సోమవారం జైనూర్ మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌక్ సమీపంలో చత్రు కాంప్లెక్స్ పక్కన నూతనంగా ఏర్పాటు చేసిన జైనూర్ మిల్క్ హబ్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మిల్క్ హబ్ నిర్వాహకుడు బాబ్లు (మేరాజ్)ను అభినందించి వ్యాపారం విజయవంతంగా కొనసాగాలని ఆకాంక్షించారు. అనంతరం వారు మాట్లాడుతూ నేటి పరిస్థితుల్లో యువతకు స్వయం ఉపాధి మంచి అవకాశాలను కల్పిస్తోందన్నారు. ప్రభుత్వం అందిస్తున్న వివిధ పథకాలు, రుణ సదుపాయాలను సద్వినియోగం చేసుకుని తమకు నచ్చిన రంగంలో వ్యాపారాలు ప్రారంభించాలని సూచించారు. పాడి పరిశ్రమ, పాల ఉత్పత్తుల విక్రయం వంటి రంగాలకు గ్రామీణ ప్రాంతాల్లో మంచి ఆదరణ ఉందన్నారు. స్థానికంగా లభించే పాలతో నాణ్యమైన ఉత్పత్తులను ప్రజలకు అందించడం ద్వారా వ్యాపారాన్ని అభివృద్ధి చేసుకోవచ్చని తెలిపారు. మరింత మంది యువత స్వయం ఉపాధి కార్యక్రమాల వైపు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సహకార చైర్మన్ కొడప హన్ను పటేల్, మండల అధ్యక్షుడు షేక్ రసీద్, జిల్లా నాయకులు షేక్ ముఖిద్, సర్పంచ్ తోడశం రాజేందర్, ఉప సర్పంచ్ ప్రకాష్, సీనియర్ నాయకులు మెస్రం అంబాజీరావు, సుభూర్ ఖాన్, రహీమ్, గంగారాం, లాల్యా, హైదర్, లచ్చు, దత్తు, మజర్ తదితరులు పాల్గొన్నారు.

# పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం



**ఉద్యమ కెరటం, దొంగ్లీ:** పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గజానన్ దేశాయ్, గ్రామ సర్పంచ్ బాచావార్ లక్ష్మణ్ పటేల్ అన్నారు. మండలంలోని మాధన్ హిప్పరగా గ్రామంలో ప్రభుత్వం మంజూరు చేసిన ఇందిరమ్మ ఇళ్లను సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు ప్రజాప్రతినిధులకు స్వాగతం పలికి శాలువాలతో సన్మానించారు. అనంతరం ఈ సందర్భంగా గజానన్ దేశాయ్ మాట్లాడుతూ పేద, బడుగు, బలహీన వర్గాల అభివృద్ధి, సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందన్నారు. గ్రామాల్లో ఇళ్లు లేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని తెలిపారు. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో పేదలకు కొత్త రేషన్ కార్డులు ఇవ్వకుండా కాలయాపన చేశారని విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజా పాలనలో, జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు కృషితో నియోజకవర్గంలోని గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్లు, నూతన రేషన్ కార్డులు మంజూరు చేస్తున్నారని పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇళ్లు నిర్మించుకుని పేద కుటుంబాలు సుఖసంతోషాలతో జీవించేలా ప్రభుత్వం అండగా నిలుస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీ వైస్ ప్రెసిడెంట్ యునుస్ పటేల్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఉమాకాంత్ పటేల్, సర్పంచులు హళ్లే బస్వంత్, సంగ్రామ్ పటేల్, విలాస్, మాజీ ఎంపీటీసీ దిన్దయాల్, జాఫర్ పటేల్, చాంద్ పటేల్, వకీల్ సాబ్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, ఉప సర్పంచ్, గ్రామ పంచాయతీ సెక్రటరీ, వార్డు సభ్యులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# ఆర్టీవో కార్యాలయం వద్ద రేడియం దోపిడీ

## జాగ్రూత్ పవన్ ఎంటర్ప్రైజెస్ ఏజెన్సీ పై చర్యలు తీసుకోవాలి

**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ :** జిల్లా కేంద్రంలోని ఆర్టిఓ కార్యాలయం వద్ద వాహనదారుల నుండి క్యూ ఆర్ రేడియం పేరుతో అధిక డబ్బులు వసూలు చేస్తున్న జాగ్రూత్ పవన్ ఎంటర్ప్రైజెస్ ఏజెన్సీ పై చర్యలు తీసుకోవాలని సామాజిక కార్యకర్త ఎండి నౌషద్ సోమవారం ప్రజా ఫిర్యాదు విభాగంలో జిల్లా అడిషనల్ కలెక్టర్ దేవిడ్ కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా నౌషద్ మాట్లాడుతూ వాహనాల ఫిట్నెస్ ప్రక్రియలో భాగంగా ఆర్టిఓ కార్యాలయానికి వచ్చే వాహనదారుల నుంచి క్యూ ఆర్ రేడియం ఏజెన్సీ నిర్ణీత రుసుము కంటే అధికంగా డబ్బులు వసూలు చేస్తుండడంతో వాహనదారులు తీవ్రంగా ఇబ్బందులకు గురి అవుతున్నరన్నారు. క్యూ ఆర్ రేడియం ఇతర జిల్లాలలో తక్కువ ధర ఉందని ఇక్కడ మాత్రం నాలుగింతల అధిక వసులు చేస్తున్నారని ఆరోపించారు. ఈ విషయం పైన సంబంధిత శాఖ అధికారులకు చెప్పిన పట్టించుకోవడం లేదని వాపోయారు. రోజురోజుకు వాహనదారులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో వాహనదారుల నుండి ఫిట్నెస్ కోసం అధిక డబ్బులు వసూలు చేస్తు, నియమ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న జాగ్రూత్ పవన్ ఎంటర్ప్రైజెస్ ఏజెన్సీ పైన చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.





# జర్నలిస్టుల హక్కుల పరిరక్షణకు శ్రీనివాస్ రెడ్డి జీవితం అంకితం

## టీయూడబ్ల్యూజే (ఐజేయు) జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ రహమాన్

### ఘనంగా మీడియా అకాడమీ చైర్మన్ జన్మదిన వేడుకలు

**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ :** తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్, మాజీ ఐజేయూ జాతీయ అధ్యక్షుడు కే శ్రీనివాస్ రెడ్డి జన్మదిన వేడుకలు తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టు సంఘం (టీయూడబ్ల్యూజే -ఐజేయు) జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ రహమాన్ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కేంద్రంలో ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా టీయూడబ్ల్యూజే నాయకులు, జర్నలిస్టులు కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా టీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ రహమాన్ మాట్లాడుతూ శ్రీనివాస్ రెడ్డి జర్నలిస్టుల సంక్షేమం కొరకు పాటుపడుతున్నారని అన్నారు. జర్నలిస్టుల హక్కుల పరిరక్షణ కొరకు ఆయన అనేక పోరాటాలు చేశారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అక్రిడేషన్ కమిటీ మెంబర్ ప్రకాష్ గౌడ్, టీయూడబ్ల్యూజే జిల్లా నాయకులు నగరారే తారు, దేవనూరి రమేష్, ప్రెస్ క్లబ్ కోశాధికారి శ్రీధర్, జర్నలిస్టులు మేకల శ్రీనివాస్, సురేష్ చారి, అబ్దుల్ హన్నన్ , రాధాకృష్ణ చారి, సయ్యద్ సోజర్ , భాస్కరా చారి, అబ్దుల్ గఫ్ఫార్, సయ్యద్ షౌకత్ అలీ తదితరులు పాల్గొన్నారు.




# ఘనంగా జర్నలిస్టు డే వేడుకలు

### జర్నలిస్టుల సేవలు అభినందనీయం

**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ :** జిల్లా కేంద్రంలో ముస్లిం వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో జర్నలిస్టు డే వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించారు. సమాజ శ్రేయస్సు కోసం విలేకరులు అందిస్తున్న సేవలను గుర్తించి, ఉత్తమంగా పనిచేస్తున్న జర్నలిస్టులు అబ్దుల్ రహమాన్, ప్రకాష్ గౌడ్, బాల శ్రీనివాస్, మసాదే సంతోష్ కుమార్, నగరారే తారు, మీర్జా సలీం బేగ్, సురేష్ చారి, మోయిన్, ముబాషీర్, అబ్దుల్ గఫ్ఫార్, సాజిద్ ఖాన్‌లను శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మున్సిపల్ ఫ్లోర్ లీడర్ అబ్దుల్లా, ముస్లిం వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు ఉబేద్ బీన్ యహియాలు మాట్లాడుతూ జర్నలిజం కత్తి మీద సాము లాంటి అత్యంత సవాలుతో కూడుకున్న వృత్తి అని, ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధిగా నిలుస్తూ సమాజానికి సేవలందించడం అభినందనీయమని కొనియాడడమే కాకుండా, జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సొసైటీ అడ్వైసర్ అహ్మద్ బీన్ అబ్దుల్లా, అవద్ బీన్ యహియ, సొసైటీ ప్రతినిధులు ఇమ్రాన్ హష్మీ, సల్మాన్ ఖాన్, మన్సూర్, షఫీ తదితరులు పాల్గొన్నారు.







# హామీల అమలు ఏదీ?

### ఆర్ఎస్ నేతల నిరసన

**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్:** కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన 420 హామీలు, 6 గ్యారెంటీలు, 13 డిక్లరేషన్లను తక్షణమే నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో జిల్లా అడిషనల్ కలెక్టర్ డేవిడ్ కి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ ఆకాష్, వైస్ చైర్మన్ ఎండి అహ్మద్, సింగల్ విండో చైర్మన్ అలీ బీన్ అహ్మద్, బిఆర్ఎస్ రాష్ట్ర నాయకురాలు సరస్వతి మాట్లాడుతూ 100 రోజుల్లో ఇచ్చిన హామీలు నెరవేరుస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, ఏళ్ళు గడుస్తున్నా ఒక్క హామీని కూడా పూర్తిగా అమలు చేయలేదని విమర్శించారు. మహాలక్ష్మి పథకం కింద నెలకు ₹2,500 సాయం, తులం బంగారం, స్కూటీలు అందజేయాలని, రైతాంగానికి రైతు భరోసా, బోనస్, 24 గంటల ఉచిత విద్యుత్, రైతు కూలీలకు ఏటా ₹12,000 ఆర్థిక సాయం అందించాలని డిమాండ్ చేశారు. అలాగే నిరుద్యోగ భృతి, జాబ్ క్యాలెండర్ అమలు, పెండింగ్ ఫీజు బకాయిల విడుదల, పెంచిన ₹4,000 పింఛన్లు, ఇందిరమ్మ ఇళ్ళు, ఆటో డ్రైవర్లకు ₹12,000 సాయం అందించడంతో పాటు గ్రామాల్లో నిలిచిపోయిన పారిశుధ్య నిర్వహణను వెంటనే చేపట్టాలని, ప్రశ్నించే వారిపై అక్రమ కేసులు పెట్టడం మానుకోవాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో రాజంపేట సర్పంచ్ బుర్స పోచయ్య, కౌన్సిలర్ లు సలాం బీన్ అహ్మద్, బాల కృష్ణా, బీ ఆర్ ఎస్ మండల అధ్యక్షుడు రవీందర్, టౌన్ అధ్యక్షుడు అహ్మద్ బీన్ అబ్దుల్లా, నాయకులు గంధం శ్రీను, సయ్యద్ నిసార్, దూడల అశోక్, పొన్నాల నారాయణ తదితరులు పాల్గొన్నారు.

# అసెంబ్లీకి ఎమ్మెల్యేలు వెళ్లకుండా అడ్డుకోవడం రాజ్యాంగ విరుద్ధం

### కలెక్టరేట్ ఎదుట ధర్నా



**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ టౌన్:** శాసనసభలోకి ప్రజాస్వామ్యబద్ధంగా వెళ్తున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను అక్రమంగా అరెస్టు చేయడాన్ని ఖండిస్తూ ఆసిఫాబాద్ జిల్లా కలెక్టరేట్ ఎదుట బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆసిఫాబాద్ మున్సిపల్ చైర్మన్ మెంగ్రే ఆకాష్, వైస్ చైర్మన్ ఎండి అహ్మద్, సింగిల్ విండో చైర్మన్ అలీ బీన్ అహ్మద్, బీఆర్ఎస్ నాయకురాలు మరుసుకోల సరస్వతి మాట్లాడుతూ చట్టసభలకు ప్రజాప్రతినిధులుగా వెళ్లే ఎమ్మెల్యేలను అసెంబ్లీకి వెళ్లకుండా అడ్డుకోవడం పక్కా రాజ్యాంగ విరుద్ధమని ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పోలీసు బలగాలను అడ్డుపెట్టుకుని ప్రతిపక్షాల ప్రజాస్వామ్య గొంతును నొక్కేందుకు కుట్ర పన్నుతున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను, ఇచ్చిన హామీల వైఫల్యాలను ప్రశ్నిస్తున్నందుకే బీఆర్ఎస్ నాయకులపై అక్రమ కేసులు బనాయిస్తూ అరెస్టులకు పాల్పడుతున్నారని ధ్వజమెత్తారు. ప్రభుత్వం ఎంతటి అణిచివేత ధోరణి ప్రదర్శించినా ప్రజల పక్షాన బీ ఆర్ ఎస్ పోరాటం ఆగేది లేదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు సలాం, బాలకృష్ణ, రాజంపేట సర్పంచ్ పోషన్న, బీ ఆర్ ఎస్ మండల అధ్యక్షుడు జబోరే రవీందర్, టౌన్ అధ్యక్షుడు అహ్మద్ బిన్ అబ్దుల్లా, నాయకులు నిస్సార్, సాంగ్డే జీవన్, ఆన్సర్, గుండా శ్యామ్, పొన్నాల నారాయణ, దూడల అశోక్, జయరాజ్, ఆశన్న, భీమేష్, శంకర్, సమాద్ తదితరులు పాల్గొన్నారు.

# కోనేరు కోనప్ప భాష మార్చుకోవాలి

### కాగజ్‌నగర్ కాంగ్రెస్ నాయకుల హెచ్చరిక



**ఉద్యమ కెరటం, కాగజ్‌నగర్:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఎమ్మెల్సీ దండే విఠల్‌లపై మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప చేసిన అనుచిత వ్యాఖ్యలపై కాగజ్‌నగర్ మండల కాంగ్రెస్ నాయకులు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. కాగజ్‌నగర్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు చునర్కర్ మహేష్, జిల్లా నాయకులు లెండుగురే శ్యామ్ రావు, గంజి రామయ్య తదితరులు మాట్లాడారు. కోనేరు కోనప్ప వెంటనే తన భాషను మార్చుకోవాలని, లేనిపక్షంలో ప్రజలే తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. 15 సంవత్సరాల పాటు అధికారంలో ఉండి సిర్పూర్ నియోజకవర్గానికి ఏం చేశారో సమాధానం చెప్పిన తర్వాతే నీతులు మాట్లాడాలని కాంగ్రెస్ నాయకులు సవాల్ విసిరారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం తీసుకొచ్చిన ధరణి పోర్టల్, 22-ఏ నిబంధనల వల్లే రైతులు తీవ్ర భూ సమస్యలు ఎదుర్కొన్నారని ఆరోపించారు. ఎన్సిబి, ఎమ్మెల్సీ దండే విఠల్ ప్రజా సమస్యలపై నిరంతరం పనిచేస్తుంటే ఓర్వలేకనే వ్యక్తిగత విమర్శలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ నేతలపై ఇకపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే ప్రజాస్వామ్యబద్ధంగా దీటైన సమాధానం ఇస్తామని స్పష్టం చేశారు.

Printed, Published and Owned by **MOHAMMAD ABDUL RAHEMAN,** and Printed at MM Printers, 1-227-3, MM Printers, REBBANA, KUMURAM BHEEM ASIFABAD- 504292, and Published from H.NO. 3-622, BAZARWADI, ASIFABAD, KUMRAMBHEEM ASIFABAD, MANCHERIAL, TELANGANA - 504293. **Editor: MOHAMMAD ABDUL RAHEMAN. PRGI NO : TGTEL/25/A0273** Email: udyamakeratam@gmail.com. Phone No: **9030717172, 9391127717**



## ఇషాన్ కిషన్ డబుల్ సెంచరీ

### దులీప్ ట్రోఫీ ఫైనల్లో అరుదైన చరిత్ర

దులీప్ ట్రోఫీ ఫైనల్లో ఇషాన్ కిషన్ చరిత్ర సృష్టించాడు. ఈస్ట్ జోన్ తరఫున కెప్టెన్‌గా బరిలోకి దిగిన అతడు అద్భుతమైన డబుల్ సెంచరీతో అదరగొట్టాడు. సౌత్ జోన్‌తో జరుగుతున్న ఫైనల్లో సోమవారం రెండో రోజు ఆటలో 200 పరుగుల మార్క్‌ను అందుకున్నాడు. ఆదివారం ఆట ముగిసే సమయానికి ఇషాన్ 111 పరుగులతో అజేయంగా ఉన్నాడు. రెండో రోజు కూడా అదే జోరు కొనసాగించాడు. ఈ డబుల్ సెంచరీతో దులీప్ ట్రోఫీ ఫైనల్లో 200 పరుగులు చేసిన ఐదో బ్యాటర్‌గా నిలిచాడు. ఇప్పటివరకు ఈ ఘనత సాధించిన వారిలో రమణ్ లాంబా, అన్షుమన్ గైక్వాడ్, ఛటేశ్వర్ పుజారా, యశస్వి జైస్వాల్ ఉన్నారు. 1987-88 సీజన్‌లో రమణ్ లాంబా 320 పరుగులతో అత్యధిక స్కోరు నమోదు చేశాడు. అదే సీజన్‌లో అన్షుమన్ గైక్వాడ్ 216 పరుగులు చేశాడు. 2016-17లో పుజారా 256 పరుగులతో అజేయంగా నిలిచాడు. 2022-23లో యశస్వి జైస్వాల్ 209 పరుగులు చేశాడు. మొదటి రోజు ఇషాన్, కుమార్ కుశాగ్ర కలిసి ఈస్ట్ జోన్‌ను పటిష్ఠ స్థితిలో నిలిపారు. వీరిద్దరూ 26.4 ఓవర్లలో 144 పరుగుల అజేయ భాగస్వామ్యం నెలకొల్పారు. రోజు ముగిసే సమయానికి ఈస్ట్ జోన్ 385/4తో నిలిచింది. రెండో రోజు కుశాగ్ర కూడా సెంచరీ పూర్తి చేసి ఔటయ్యాడు. అయినా ఇషాన్ ఇన్నింగ్స్‌పై దాని ప్రభావం పడలేదు. ఈ డబుల్ సెంచరీతో ఇషాన్ ఫస్ట్‌క్లాస్ క్రికెట్‌లో 4,000 పరుగుల మైలురాయిని కూడా దాటాడు. ఇదే ఫార్మాట్‌లో అతడికి ఇది 10వ సెంచరీ. సుదీర్ఘ ఫార్మాట్‌లో తన స్థానాన్ని తిరిగి సాధించేందుకు ఇషాన్ చేస్తున్న ప్రయత్నాలకు ఈ ఇన్నింగ్స్ మరింత బలాన్నిచ్చింది. ఈస్ట్ జోన్ చివరిసారిగా 13 ఏళ్ల క్రితం దులీప్ ట్రోఫీని గెలిచింది. ప్రస్తుత ఫైనల్లో ఆ జట్టు ఆధిపత్యంలో ఉంది. బౌలర్లు రాణిస్తే రెండోసారి బ్యాటింగ్ చేయకుండానే టైటిల్ గెలిచే అవకాశం ఉంది.

# భారత్ టైటిల్ ఫేవరేట్‌గా కనిపిస్తోంది





మహిళల ఆసియా కప్ 2026 టోర్నీలో హర్మన్‌ప్రీత్ సారథ్యంలోని భారత జట్టు సెమీఫైనల్‌కు దూసుకెళ్లింది. లీగ్ దశలో మూడు మ్యాచ్‌లకు మూడు గెలిచిన భారత్.. గ్రూప్-ఏ టాపర్‌గా నిలిచింది. గ్రూప్-బీ రన్నరప్‌తో సెమీఫైనల్ మ్యాచ్ ఆడనుంది. గ్రూప్-బీ రన్నరప్‌గా బంగ్లాదేశ్ నిలిచే అవకాశం ఉంది. అయితే ఆ జట్టుకు యూఏఈతో గట్టి పోటీ నెలకొంది. ఈ రెండు జట్ల మధ్య మంగళవారం జరిగే మ్యాచ్ ఫలితంతో భారత్ సెమీస్ ప్రత్యర్థి ఎవరో తేలిపోనుంది.గత చరిత్ర చూసుకున్నా.. ఫామ్ పరిశీలించినా.. భారత్ టైటిల్ ఫేవరేట్‌గా కనిపిస్తోంది. అయితే ఈ టోర్నీలో భారత్ విజేతగా నిలిచినా.. ట్రోఫీ దక్కే పరిస్థితులు కనిపించడం లేదు. ఎందుకంటే పాకిస్థాన్ క్రికెట్ బోర్డు(పీసీబీ) ఛైర్మన్ మోహ్సిన్ నఖ్వీ.. ఆసియా క్రికెట్ కౌన్సిల్(ఏసీసీ) ఛైర్మన్ హోదాలో ఫైనల్ మ్యాచ్‌కు చీఫ్ గెస్ట్‌గా హాజరుకానున్నాడు. అతనే మహిళల ఆసియా కప్ 2026 విజేతకు ట్రోఫీ అందజేయనున్నాడు. ఈ విషయంపై అధికారిక సమాచారం లేకపోయినప్పటికీ.. చీఫ్ గెస్ట్ మోహ్సిన్ నఖ్వీనే అంటూ వార్తలు హల్‌చల్ చేస్తున్నాయి. గతేడాది పురుషుల ఆసియా కప్ 2025 ఫైనల్ మోహ్సిన్ నఖ్వీ కారణంగా రసాభాసగా మారిన సంగతి తెలిపిందే. ఈ టోర్నీలో విజేతగా నిలిచిన భారత్.. నఖ్వీ చేతుల మీదుగా ట్రోఫీ అందుకునేందుకు నిరాకరించింది. మరోవైపు నఖ్వీ కూడా తనే ట్రోఫీని అందజేస్తానని పట్టుబట్టాడు. అంతేకాకుండా ట్రోఫీని తనవెంట తీసుకెళ్లిపోయాడు. దాంతో భారత ఆటగాళ్లు ట్రోఫీ లేకుండానే సంబరాలు చేసుకున్నారు. ఇప్పటికీ ఆ ట్రోఫీ ఏసీసీ కార్యాలయంలోనే ఉంది. బీసీసీఐ ఎన్నిసార్లు డిమాండ్ చేసినా మోహ్సిన్ మాత్రం వెనక్కి తగ్గలేదు. మహిళల ఆసియా కప్ ఫైనల్ అనంతరం కూడా ఇవే పరిస్థితులు పునరావృతమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. సెప్టెంబర్ 13న ఫైనల్ మ్యాచ్ జరగనుంది. భారత్ విజేతగా నిలిస్తే మాత్రం.. నఖ్వీ చేతుల మీదు టైటిల్ తీసుకోదు. అదే జరిగితే మరోసారి ట్రోఫీ లేకుండానే భారత్ విజేతగా స్వదేశానికి రావాల్సి ఉంటుంది. ఏం జరుగుతుందో చూడాలి. భారత్ చేతిలో చిత్తుగా ఓడిన పాకిస్థాన్.. సెమీస్ బెర్త్ కోసం తండ్లాడుతోంది. నేడు (సోమవారం) హాంగ్‌కాంగ్‌తో జరిగే ఆఖరి లీగ్ మ్యాచ్‌లో విజయం సాధిస్తేనే పాక్ సెమీస్ చేరనుంది. లేదంటే ఇంటిబాట పడుతోంది.

# సౌత్‌జోన్ కొంపముంచిన సిరాజ్

ప్రతిష్టాత్మక దులీప్ ట్రోఫీ 2026 ఫైనల్లో ఇషాన్ కిషన్ సారథ్యంలోని ఈస్ట్ జోన్ ఆధిపత్యం చెలాయిస్తోంది. తిలక్ వర్మ సారథ్యంలోని సౌత్ జోన్‌తో చెన్నై వేదికగా జరుగుతున్న ఈ మ్యాచ్‌లో ఈస్ట్ జోన్ తొలి ఇన్నింగ్స్‌లో 708 పరుగుల భారీ స్కోర్ చేసింది. ఇషాన్ కిషన్(334 బంతుల్లో 30 ఫోర్లు, 7 సిక్స్‌లతో 270)తో డబుల్ సెంచరీతో సత్తా చాటగా.. కుమార్ కుశాగ్ర(132 బంతుల్లో 8 ఫోర్లు, 5 సిక్స్‌లతో 101) సెంచరీతో చెలరేగాడు. శిఖర్ మోహన్(120 బంతుల్లో 9 ఫోర్లు, 3 సిక్స్‌లతో 85), అభిమన్యు ఈశ్వరన్(86 బంతుల్లో 10 ఫోర్లు, సిక్స్‌తో 72) హాఫ్ సెంచరీలతో రాణించారు. వైభవ్ సూర్యవంశీ(37 బంతుల్లో 5 ఫోర్లు, సిక్స్‌తో 44) దూకుడుగా ఆడాడు. సౌత్ జోన్ బౌలర్లలో త్రిపురణ విజయ్(4/180) నాలుగు వికెట్లు తీయగా.. చామ మిలింద్, శ్రేయస్ గోపాల్ రెండేసి వికెట్లు పడగొట్టారు. షేక్ రషీద్‌కు ఒక వికెట్ దక్కింది. మిగతా బౌలర్లు దారుణంగా విఫలమయ్యారు. ముఖ్యంగా మహమ్మద్ సిరాజ్ తీవ్రంగా నిరాశపర్చాడు. 25 ఓవర్లు బౌలింగ్ చేసి ఒక వికెట్ తీయకపోగా.. 5.60 ఎకానమీతో 140 పరుగులిచ్చుకున్నాడు. అతని వైఫల్యం ఈస్ట్ జోన్‌కు కలిసొచ్చింది. దూకుడుగా ఆడిన ఆ జట్టు రెండు రోజుల పాటు పూర్తిగా బ్యాటింగ్ చేసి రికార్డ్ స్కోర్ అందుకుంది. దులీప్‌ట్రోఫీ ఫైనల్స్ చరిత్రలోనే ఇది రెండో అత్యధిక స్కోర్‌గా నిలిచింది. 1987 దులీప్ ట్రోఫీ ఫైనల్లో వెస్ట్ జోన్‌పై నార్త్ జోన్ 868 పరుగులు చేసింది. ఇప్పటి వరకు ఇదే అత్యధిక స్కోర్‌గా కొనసాగుతోంది. తాజా ఫైనల్‌కు ముందు రెండు సార్లు మాత్రమే జట్లు 700 ప్లస్ స్కోర్లు చేశాయి. 1986లో సౌత్ జోన్.. 1991లో నార్త్ జోన్ 700 పరుగుల మార్క్‌ను అందుకున్నాయి.హాఫ్ సెంచరీకి చేరువైన అనుకూల్ రాయ్(45)ను షేక్ రషీద్ ఔట్ చేయగా.. షమీ, ఖురైషి సౌత్ జోన్ బౌలర్ల సహనాన్ని పరీక్షించారు. శ్రేయాస్ గోపాల్ ఈ జోడీని విడదీసాడు. ఖరేషి(40)ని క్యాచ్ ఔట్‌గా పెవిలియన్ చేర్చాడు. క్రీజులోకి వచ్చిన ఇషాన్ కిషన్ దూకుడుగా ఆడి జట్టు స్కోర్ 700 ధాటించాడు. అతనితో పాటు ముఖేష్ కుమార్(0)ను



విజయ్ పెవిలియన్ చేర్చి ఈస్ట్ జోన్ భారీ ఇన్నింగ్స్‌కు తెరదించాడు. దాంతో రెండో రోజు ఆట ముగిసింది.

## రిజ్వాన్, ఇమామ్ ఉల్ హక్‌పై ఫిక్సింగ్ ఆరోపణలు!

### పాకిస్థాన్ క్రికెట్ సంక్షోభం మరింత తీవ్ర రూపం

పాకిస్థాన్ క్రికెట్ సంక్షోభం మరింత తీవ్ర రూపం దాల్చింది. ఆ దేశ ఆటగాళ్లపై ఏకంగా ఫిక్సింగ్ ఆరోపణలు రావడం తీవ్ర దుమారం రేపుతోంది. పాకిస్థాన్ క్రికెట్ బోర్డు(పీసీబీ) అంతర్గత విచారణ కూడా చేపట్టినట్లు తెలుస్తోంది. మహమ్మద్ రిజ్వాన్, ఇమామ్ ఉల్ హక్ ఆఫ్ ఫీల్డ్ ప్రవర్తన అనుమానస్పదంగా ఉందనే వార్తలు కలకలం సృష్టించాయి. ఇంగ్లండ్ పర్యటనలో ఘోర పరాజయాలతో మరో మ్యాచ్ మిగిలి ఉండగానే సిరీస్‌ను కోల్పోయిన పాకిస్థాన్ జట్టు ప్రస్తుతం తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటుంది. ఈ ఘోర పరాజయాల నేపథ్యంలో పీసీబీ కూడా కఠిన చర్యలు తీసుకుంది. హెడ్ కోచ్, బౌలింగ్ కోచ్‌తో పాటు ఏడుగురు ఆటగాళ్లపై వేటు వేసింది. దాంతో పాకిస్థాన్ జట్టు అప్రతిష్టపాలై ఇంట బయట తీవ్ర విమర్శలు ఎదుర్కొంది. అయితే ఇంగ్లండ్ గడ్డపై పాకిస్థాన్ ఘోర పరాజయాలకు క్రికెటర్ల వైఫల్యంతో పాటు... ఫిక్సింగ్ కూడా ఓ కారణమని మీడియాలో కథనాలు రావడం తీవ్ర చర్చనీయాంశమైంది. ముఖ్యంగా వేటుకు గురైన ఏడుగురిలో రిజ్వాన్, ఇమామ్ ఉల్ హక్ మొబైల్ డేటాను పీసీబీ స్వాధీనం చేసుకొని విచారణ జరుపుతుందని పాక్‌కు చెందిన జియో న్యూస్ పేర్కొంది. ఈ కథనం ప్రకారం.. పీసీబీ అధికారులు.. కేవలం ఆటగాళ్ల ప్రవర్తననే కాకుండా.. వారు సంప్రదించిన వ్యక్తులను కూడా విచారిస్తున్నట్లు తెలుస్తోంది. ఫిక్సింగ్ ఆరోపణలకు సంబంధించిన వివరాలు ఇంకా బయటకు రావాల్సి ఉన్నప్పటికీ.. రిజ్వాన్, ఇమామ్ భవిష్యత్తుపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఇంగ్లండ్ పర్యటనకు రిజ్వాన్, ఇమామ్‌లను ఎంపిక చేయడంపై వివరణ కోరుతూ సెలెక్టర్లకు పీసీబీ షోకాజ్ నోటీసులు కూడా జారీ చేసినట్లు తెలుస్తోంది. మరోవైపు మూడో టెస్ట్ ఆడే ఆటగాళ్ల నుంచి పీసీబీ మొబైల్స్ స్వాధీనం చేసుకున్నట్లు పాకిస్థాన్ వార్తా సంస్థ 365 న్యూస్ పేర్కొంది. మ్యాచ్ ముగిసే వరకు ఆటగాళ్లకు మొబైల్స్ ఇచ్చేది లేదని స్పష్టం చేసినట్లు రాసుకొచ్చింది. బర్మింగ్‌హామ్ వేదికగా సెప్టెంబర్ 9 నుంచి మూడో టెస్ట్ ప్రారంభం కానుంది. ఫిక్సింగ్ ఆరోపణల నేపథ్యం పాక్ బోర్డు విచారణకు ఆదేశించింది. ఆటగాళ్లపై క్రమశిక్షణపరంగా.. అంతర్గత విచారణ జరుపుతున్నామని సోమవారం పీసీబీ మీడియా ప్రతినిధి అమీర్ మీర్ వెల్లడించాడు. 'ఇంగ్లండ్ పర్యటనలో పాక్ ఆటగాళ్ల క్రమశిక్షణ, ప్రవర్తన గురించి మీడియాలో కథనాలు రావడంతో విచారణకు ఆదేశించాం. ఈ విషయాలను అంతర్గతంగా సమీక్షిస్తాం. పీసీబీ ప్రమాణాలు, నియమనిబంధనల మేరకు విచారణ కొనసాగుతుంది. ఈ పరిస్థితుల్లో సోషల్ మీడియాలో వచ్చే వార్తలు, కథనాలను విశ్వసించవద్దని కోరుతున్నాం. ప్రస్తుతానికైతే పీసీబీ ఈ వ్యవహారంపై ఎలాంటి కామెంట్ చేయడం లేదు. అభిమానులు, వాటాదారులు అందరూ పీసీబీ నుంచి అధికారికంగా వచ్చే సమాచారాన్ని మాత్రమే నమ్మాలి' అని అమిర్ మిర్ పేర్కొన్నాడు. కానీ ఆటగాళ్ల మొబైల్స్ లాక్కున్నారనే వార్తలపై అతను స్పందించలేదు.



# వరల్డ్ కప్‌లో భువీ కచ్చితంగా ఉండాల్సిందే..

### సెలక్టర్లకు మాజీ క్రికెటర్ విజ్ఞప్తి

భారత జట్టుకు విశేష సేవలందించిన సీనియర్ ఫాస్ట్ బౌలర్ భువనేశ్వర్ కుమార్‌కు 2027 వన్డే ప్రపంచకప్‌లో అవకాశం కల్పించాలని భారత మాజీ క్రికెటర్ సురేష్ రైనా డిమాండ్ చేశారు. ఐపీఎల్ తో పాటు ఇటీవల ముగిసిన యూపీ టీ20 లీగ్‌లో భువీ అద్భుతమైన బౌలింగ్ ప్రదర్శనతో ఆకట్టుకున్నారు. ఈ క్రమంలోనే సెలెక్టర్లు భువీ పేరును పరిశీలించాలని రైనా సూచించారు. అక్టోబర్-నవంబర్ 2027లో సౌతాఫ్రికా, జింబాబ్వే, నమీబియాల్లో వన్డే ప్రపంచకప్ జరగనుంది. ఆయా దేశాల్లో ఉండే వేగవంతమైన, స్వింగ్‌కు అనుకూలించే పిచ్‌లపై భువనేశ్వర్ అనుభవం, బంతిపై అతనికున్న నియంత్రణ భారత జట్టు విజయాలకు ఎంతో కీలకంగా మారుతాయని రైనా అభిప్రాయపడ్డారు. యూపీ టీ20 లీగ్‌లో లక్నో ఫాల్కన్స్ జట్టు తరఫున ఆడిన భువనేశ్వర్ కుమార్ 11 మ్యాచుల్లో 14 వికెట్లు పడగొట్టారు. కేవలం వికెట్లే కాకుండా ఆయన వేసిన పొదుపైన బౌలింగ్ అందరినీ ఆకట్టుకుంది. మొత్తం 11 మ్యాచుల్లో ఆయన ఏకంగా 119 డాట్ బాల్స్



వేశారు. అంటే దాదాపు 20 ఓవర్ల పాటు ప్రత్యర్థి బ్యాటర్లకు ఒక్క పరుగు కూడా ఇవ్వకుండా కట్టిపడేసారు. అంతేకాకుండా కేవలం 6.11 ఎకానమీ రేటుతో పరుగులు ఇచ్చి తనలోని పదును ఇంకా తగ్గలేదని నిరూపించారు. బౌలింగ్‌లో స్వింగ్, వైవిధ్యంతో ప్రత్యర్థులను తిప్పలు పెట్టడంలో భువీ శైలి ప్రత్యేకం. భారత జట్టు రాబోయే రోజుల్లో యువత, అనుభవం కలయికతో ముందుకు వెళ్లాలని రైనా ఆకాంక్షించారు. భారత కెప్టెన్ శుభ్‌మన్ గిల్ భువనేశ్వర్ కుమార్, మహమ్మద్ షమీల అనుభవానికి ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ జట్టులో ఉన్నట్లే, బౌలింగ్ విభాగంలో ఈ ఇద్దరు సీనియర్ పేసర్లు కూడా గిల్ ప్రణాళికల్లో భాగం కావాలని తెలిపారు. ముగ్గురు లేదా నలుగురు స్పెషలిస్ట్ పేసర్లను ఎంపిక చేసే క్రమంలో భువీ అనుభవాన్ని విస్మరించకూడదని వివరించారు. ఇక మీరట్ మెవ్రిక్స్ జట్టును విజేతగా నిలిపిన రింకూ సింగ్ కెప్టెన్సీ టాలెంట్ పై కూడా రైనా ప్రశంసల జల్లు కురిపించారు. ఒత్తిడి సమయంలో రింకూ ప్రదర్శించిన వ్యూహాత్మక చతురత అద్భుతమని కొనియాడారు. ఇండియన్ ప్రీమియర్ లీగ్ లో కోల్‌కతా నైట్ రైడర్స్ (కేకేఆర్) యాజమాన్యం రింకూ సింగ్‌కు కెప్టెన్సీ బాధ్యతలు అప్పగిస్తే బాగుంటుందని అభిప్రాయపడ్డారు. దేశవాళీ టాలెంట్‌ను వెలికితీయడంలో యూపీ టీ20 లీగ్ ఎంతగానో తోడ్పడుతోందని కొనియాడారు.


ఉద్యమ కెరటం
నిజం రక్షతి రక్షితః UDYAMAKERATAM TELUGU DAILY తెలుగు దినపత్రిక
మంగళవారం
8 సెప్టెంబర్ 2026

# ఇద్దరూ ఒకే సిగరెట్ తాగుతూ..

## మరోసారి అడ్డంగా దొరికిపోయిన జయం రవి-కెనీషా

చెన్నై, సెప్టెంబర్ 7 (ఉద్యమ కెరటం): కోలీవుడ్ ప్రముఖ నటుడు జయం రవి (రవి మోహన్), సింగర్ కెనీషాతో కలిసి ఉన్న ఒక వీడియో సోషల్ మీడియాలో తీవ్ర దుమారం రేపుతోంది. గత కొన్ని రోజులుగా భార్య ఆర్తితో విడాకుల వ్యవహారం కోర్టులో నడుస్తుండగా, కెనీషాతో రవి సన్నిహితంగా ఉంటున్నారనే ప్రచారం సినీ వర్గాల్లో ఊపందుకుంది. ఈ క్రమంలో వారిద్దరూ కలిసి ఉన్న సరికొత్త వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. సదరు వీడియోలో జయం రవి, కెనీషాతో పాటు మరికొందరు ఒక గ్రూప్ మీటింగ్‌లో పాల్గొన్నట్లు కనిపిస్తోంది. ఆ తీవ్ర చర్చల సమయంలో జయం రవి సిగరెట్ తాగి, దానిని కెనీషాకు అందించడం, ఆమె కూడా దానిని పీల్చడం స్పష్టంగా నమోదైంది. గతంలో తమ మధ్య ఎలాంటి సంబంధం లేదని, విడాకులు పూర్తయ్యే వరకు నటనకు విరామం ఇస్తున్నానని ప్రకటించిన రవి.. ఇటీవల తిరుమల దర్శనంలోనూ, ఇప్పుడు ఈ వీడియోలోనూ కెనీషాతో కలిసి కనిపిస్తుండటంపై అభిమానులు, నెటిజన్లు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఆరంభంలో జయం రవికి మద్దతు తెలిపిన పలువురు నెటిజన్లు, ఈ ఘటనలతో తమ అభిప్రాయం మారిపోయిందని విమర్శలు గుప్పిస్తున్నారు.







# ఇండస్ట్రీకి గుడ్ బై చెప్పేస్తుందా?

హైదరాబాద్, సెప్టెంబర్ 7 (ఉద్యమ కెరటం): లేడీ సూపర్ స్టార్ గా తనకంటూ చెరగని ముద్ర వేసుకున్న కథానాయిక అనుష్క శెట్టి. అరుంధతి, భాగమతి, బాహుబలి వంటి భారీ చిత్రాలతో కోట్లాది మంది అభిమానులను సంపాదించుకున్న స్వీటీ గత కొంతకాలంగా వెండితెరకు.. మీడియా ప్రమోషన్లకు దూరంగా ఉండటం సినీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. అమ్మడు నటించిన చిత్రాలు విడుదలవుతున్నా? ప్రచార కార్యక్రమాల్లో పాల్గొనకపోవడం వెనుక పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. తాజా సమాచారం ప్రకారం అనుష్క నటనా జీవితానికి ముగింపు పలకాలనే ఆలోచనలో ఉన్నట్లు పరిశ్రమలో గుసగుసలు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం అనుష్క మలయాళంలో తెరకెక్కుతోన్న భారీ బడ్జెట్ జానపద చిత్రం –కథనార్: ది విల్డ్ సోర్సరర్– లో కీలక పాత్ర పోషిస్తోంది. ఈ ప్రతిష్టాత్మక చిత్రం ఫలితంపైనే అనుష్క భవిష్యత్తు ప్రణాళికలు ఆధారపడి ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. గతంలో క్రమం తప్పకుండా వరుస సినిమాలు చేసిన అనుష్క ఇటీవల కాలంలో కథల ఎంపికలో అత్యంత జాగ్రత్త వహిస్తున్నారు. మనసుకు నచ్చిన, ప్రాధాన్యత ఉన్న పాత్రలకు మాత్రమే ఓకే చెబుతున్నారు. అయితే సినిమాల ఎంపిక తగ్గించడంతో పాటుగా ఆయా చిత్రాల ప్రచార వేదికలపై ఆమె కనిపించకపోవడం అభిమానులను కలవరపెడుతోంది. పర్సనల్ లైఫ్, ఫిట్‌నెస్ లైఫ్‌స్టైల్‌పై దృష్టి పెట్టడం వల్లే ఆమె గ్లామర్ ప్రపంచానికి కాస్త విరామం ఇచ్చారని కొందరు విశ్లేషిస్తున్నారు. –కథనార్– చిత్రం పాన్–ఇండియా స్థాయిలో అత్యంత అట్టహాసంగా విడుదల కానుంది. ఈ సినిమా కనుక బాక్సాఫీస్ వద్ద ఆశించిన స్థాయిలో విజయాన్ని సాధిస్తే అనుష్క కెరీర్‌ను మరికొంత కాలం కొనసాగించే అవకాశం ఉందంటున్నారు. ఒకవేళ ప్రాజెక్ట్ ఫలితం తారుమారైతే స్వీటీ పూర్తిస్థాయిలో చిత్ర పరిశ్రమకు గుడ్ బై చెప్పి, వ్యక్తిగత జీవితానికే ప్రాధాన్యత ఇవ్వాలని భావిస్తున్నట్లు ప్రచారం మొదలైంది. అనుష్క శెట్టి గ్లామర్ పాత్రలకే పరిమితం కాలేదు. లేడీ ఓరియెంటెడ్ సినిమాలతో బాక్సాఫీస్ వద్ద హీరోలకు సమానంగా వసూళ్లు రాబట్టిన నటి. టాలీవుడ్, కోలీవుడ్‌లలో తిరుగులేని ఇమేజ్‌ను సంపాదించుకున్న అమ్మడు పరిశ్రమను వీడుతున్నారనే వార్తలు అభిమానులను నిరాశకు గురి చేస్తున్నాయి. సోషల్ మీడియా వేదికగా స్వీటీ తిరిగి పూర్తిస్థాయిలో సినిమాలు చేయాలని ఫ్యాన్స్ కోరుకుంటున్నారు. ఏది ఏమైనా? –కథనార్– చిత్రం విడుదలయ్యే వరకు ఈ ప్రచారాలపై స్పష్టత వచ్చే అవకాశం లేదు. అనుష్క నిర్ణయం ఏదైనా? అమ్మడు మళ్లీ పూర్వ వైభవంతో వెండితెరపై మెరవాలని.. మరిన్ని పవర్‌ఫుల్ పాత్రలతో ప్రేక్షకులను అలరించాలని అభిమానులు మాత్రం బలంగా కోరుకుంటున్నారు.

# 'రంభ ఊర్వశి మేనక' కలెక్షన్స్ జోరు


హైదరాబాద్, సెప్టెంబర్ 7 (ఉద్యమ కెరటం): ఈమధ్య సీరియస్ రోల్స్, ఇంటెన్స్ డ్రామాలు చేస్తూ వచ్చిన అల్లరి నరేష్.. మళ్లీ తన సొంత ట్రాక్ అయిన ఫుల్ లెంగ్త్ ఎంటర్‌టైన్‌మెంట్ వైపు అడుగులేశారు. ఆడియన్స్ కూడా ఆయన నుంచి ఎక్కువగా ఆశించేది వింటేజ్ కామెడీ టైమింగే కావడంతో లేటెస్ట్ మూవీ 'రంభ ఊర్వశి మేనక'పై రిలీజ్ ముందే క్రేజ్ ఏర్పడింది. ఫాంటసీ బ్యాక్‌డ్రాప్‌లో అవుట్ అండ్ అవుట్ కామెడీ ట్రాక్ లో ఈ సినిమా థియేటర్లలోకి వచ్చింది. మొదటి రోజు మార్నింగ్ షోస్ పడగానే కొన్ని చోట్ల మిక్స్‌డ్ టాక్ వినిపించినప్పటికీ, సినిమాలోని ఫన్ ఎలిమెంట్స్ కుర్రాళ్లతో పాటు ఫ్యామిలీస్ కి కనెక్ట్ అవ్వడం మొదలైంది. రొటీన్ కమర్షియల్ మాస్ సినిమాల మధ్య కాసేపు రిలాక్స్ అయి హాయిగా నవ్వుకునే స్పేస్ దొరకడంతో నెమ్మదిగా మౌత్ టాక్ బలపడింది. ముఖ్యంగా శనివారం, ఆదివారం నాటికి బీ, సీ సెంటర్లలో కూడా ఈవెనింగ్ షోలకు ఆక్యుపెన్సీలు మెరుగవుతూ వచ్చాయి. ఈ పాజిటివ్ వర్డ్ ఆఫ్ మౌత్ బాక్సాఫీస్ కలెక్షన్లలో కనిపిస్తోంది. మొదటి మూడు రోజుల్లోనే ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా 4.40 కోట్లకు పైగా గ్రాస్ వసూలు చేసి డీసెంట్ వీకెండ్ నంబర్లను నమోదు చేసింది. మిక్స్‌డ్ టాక్ ప్రభావం కొంత ఉన్నప్పటికీ ఈ స్థాయి వసూళ్లు రాబట్టడం మామూలు విషయం కాదు. అల్లరి నరేష్ టైమింగ్‌కి, కామెడీ జానర్‌కు ఇంకా ఆ క్రేజ్ తగ్గలేదని చెప్పవచ్చు. సినిమాలో స్వర్గలోకం నేపథ్యం, రంభ, ఊర్వశి, మేనకలుగా కనిపించిన నటీమణులతో నరేష్ చేసిన కామెడీ ట్రాక్స్ కూడా హైలెట్ అయ్యాయి. లాజిక్కులు వెతక్కుండా కేవలం ఎంటర్‌టైన్‌మెంట్‌ను మాత్రమే ఎంజాయ్ చేసే ఆడియన్స్‌కు ఈ కంటెంట్ బాగా రీచ్ అయింది. చైతన్ భరద్వాజ్ అందించిన మ్యూజిక్, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ ఆ ఫన్ మూడ్‌ను నిలబెట్టడంలో సాయపడ్డాయి. కథ పరంగా కన్ఫ్యూజన్ ఏమి లేదు, రన్‌టైమ్ తక్కువగా ఉండటం, నరేష్ తన మార్క్ కామెడీతో నెట్టుకురావడం సినిమాకు కలిసొచ్చింది. దర్శకుడు చంద్రమోహన్ నరేష్ కు తగ్గ ఫన్ ను క్రియేట్ చేశాడు, హాస్య మూవీస్ నిర్మాణ విలువలు సినిమా స్కేల్‌కు సరిపోయేలా ఉన్నాయి. పెద్దగా హంగులకు పోకుండా కేవలం ఫన్ ట్రాక్స్‌పైనే ఫోకస్ పెట్టడంతో బాక్సాఫీస్ వద్ద వీకెండ్ వరకు ఒక మోస్తరుగా నిలబడగలిగింది. అయితే చిత్రానికి అసలైన ఛాలెంజ్ సోమవారం నుంచే మొదలవుతోంది. వీకెండ్‌లో వచ్చిన డీసెంట్ నంబర్స్ మిక్స్‌డ్ టాక్ ఉన్న సినిమాలకు వర్కింగ్ డేస్‌లో కంటిన్యూ అవ్వడం అంత సులువు కాదు. ఇక రాబోయే రోజుల్లో ఈ సినిమా ఎలాంటి కలెక్షన్స్ అందుకుంటుందో చూడాలి.







# 'ది ప్యారడైజ్' విడుదల వాయిదా?




హైదరాబాద్, సెప్టెంబర్ 7 (ఉద్యమ కెరటం): నేచురల్ స్టార్ నాని కథానాయకుడిగా నటిస్తున్న యాక్షన్ డ్రామా 'ది ప్యారడైజ్' విడుదల తేదీపై మళ్లీ నీలినీడలు కమ్ముకున్నాయి. ముందుగా ప్రకటించిన ప్రకారం సెప్టెంబర్ 24న ఈ చిత్రాన్ని విడుదల చేయాల్సి ఉండగా, కొన్ని కారణాల వల్ల వాయిదా పడే అవకాశం ఉందని టాలీవుడ్‌లో జోరుగా ప్రచారం జరుగుతోంది. పోస్ట్ ప్రొడక్షన్ పనుల్లో జాప్యం కారణంగా సినిమాను అక్టోబర్ 1వ తేదీకి మార్చాలని చిత్రబృందం భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఫిల్మ్ నగర్ వర్గాల సమాచారం ప్రకారం, 'ది ప్యారడైజ్' క్లైమాక్స్‌లో భారీ స్థాయిలో వీఎఫ్‌ఎక్స్, సీజీ వర్క్ ఉంది. ఈ గ్రాఫిక్స్ పనులు అనుకున్న సమయానికి పూర్తి కావడం లేదని, అందుకే విడుదల తేదీని వాయిదా వేయాలనే ఆలోచనలో ఉన్నారని అంటున్నారు. నిర్మాత సుధాకర్ చెరుకూరి ఒక్క క్లైమాక్స్ సీజీ వర్క్ కోసమే సుమారు రూ.2 కోట్లు ఖర్చు చేస్తున్నారని, నాణ్యత విషయంలో ఏమాత్రం రాజీ పడకూడదనే ఉద్దేశంతోనే ఈ జాప్యం జరుగుతోందని సమాచారం. ఒకవేళ ఈ సినిమా అక్టోబర్ 1కి వాయిదా పడితే, బాక్సాఫీస్ వద్ద ఆసక్తికర పోటీ నెలకొననుంది. నాగవంశీ నిర్మించిన 'ఆదర్శ కుటుంబం హౌస్ నెం. 47' అక్టోబర్ 2న విడుదల కానుంది. విశేషమేమిటంటే, 'ది ప్యారడైజ్' నైజాం హక్కుల్లో నాగ వంశీకి 25 శాతం వాటా ఉంది. గతంలో 'ది ప్యారడైజ్' కోసం ఆయన తన సినిమాను వాయిదా వేసుకున్నారు. ఇప్పుడు ఈ రెండు చిత్రాలు దాదాపు ఒకేసారి విడుదలయ్యే పరిస్థితి ఏర్పడుతోంది. అక్టోబర్ రెండో వారంలో విజయ్ దేవరకొండ 'రణబాలి', సూపర్ స్టార్ రజనీకాంత్ 'జైలర్ 2' వంటి పెద్ద సినిమాలు కూడా రానుండటంతో పోటీ మరింత తీవ్రంగా ఉండనుంది. ఇప్పటికే 'ప్యారడైజ్' సినిమా రెండుసార్లు వాయిదా పడింది. తొలుత మార్చి 26, ఆ తర్వాత ఆగస్టు 21 తేదీలను ప్రకటించి, చివరకు సెప్టెంబర్ 24ను ఖరారు చేశారు. ఇప్పుడు మరోసారి వాయిదా పడితే ఇది మూడోసారి అవుతుంది. ఇది డిస్ట్రిబ్యూటర్లు, ఎగ్జిబిటర్లపై ప్రభావం చూపే

Printed, Published and Owned by **MOHAMMAD ABDUL RAHEMAN**, and Printed at MM Printers, 1-227-3, MM Printers, REBBANA, KUMURAM BHEEM ASIFABAD- 504292, and Published from H.NO. 3-622, BAZARWADI, ASIFABAD, KUMRAMBHEEM ASIFABAD, MANCHERIAL, TELANGANA - 504293. **Editor: MOHAMMAD ABDUL RAHEMAN. RNI NO : TGTEL/25/A0273** Email: udyamakeratam@gmail.com. Phone No: **9030717172, 9391127717**

# ఎమ్మెల్సీ తాతా మధు బహిరంగ క్షమాపణ చెప్పాలి



**ఉద్యమ కెరటం, డోంగ్లీ:** రాష్ట్ర శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్పై ఎమ్మెల్సీ తాతా మధు చేసిన అనుచిత వ్యాఖ్యలను డోంగ్లీ మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు తీవ్రంగా ఖండించారు. సోమవారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గజానన్ దేశాయ్ మాట్లాడుతూ దళిత ముద్దుబిడ్డ అయిన శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్పై అనుచిత వ్యాఖ్యలు చేయడం సరి కాదన్నారు. స్పీకర్ హోదాను గౌరవించకుండా రౌడీ తరహాలో వ్యాఖ్యలు చేయడం తగదని పేర్కొన్నారు. ఎమ్మెల్సీ తాతా మధు వెంటనే స్పీకర్కు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ నాయకులకు చిత్తశుద్ధి ఉంటే రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమ పథకాలు, ప్రజా సమస్యలపై అసెంబ్లీలో చర్చించాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ కార్యక్రమాలపై ప్రజల్లో సానుకూల స్పందన వస్తుండటాన్ని ప్రతిపక్షాలు జీర్ణించుకోలేక లేనిపోని అపోహలు సృష్టిస్తున్నాయని ఆరోపించారు. అసెంబ్లీ కార్యకలాపాలను అడ్డుకోవడం, ప్రజా సమస్యలపై చర్చకు అవకాశం లేకుండా చేయడం సరికాదన్నారు. జుక్కల్ ఎమ్మెల్యే కాంతారావు ఆదేశాల మేరకు ఎమ్మెల్సీ తాతా మధుపై చట్టబద్ధంగా చర్యలు తీసుకునేలా కార్యాచరణ చేపడతామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనపై ప్రజలు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని పేర్కొన్నారు. ప్రతిపక్ష నాయకులు అసెంబ్లీలో ప్రశాంతంగా రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమ పథకాలు, ప్రజా సమస్యలపై చర్చించాలని సూచించారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఇప్పటివరకు అసెంబ్లీకి రాకపోవడం వారి చిత్తశుద్ధికి నిదర్శనమని విమర్శించారు. ఈ సమావేశంలో సర్పంచుల ఫోరం అధ్యక్షుడు బాచావార్ లక్ష్మణ్ పటేల్, మద్నూర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పరమేష్ పటేల్, మాజీ ఎంపీటీసీ దిన్దయాల్, సర్పంచులు హళ్లే బస్వంత్, సంగ్రామ్ పటేల్, విలాస్ గాయక్వాడ్, మల్లికార్జున్, కాంగ్రెస్ నాయకులు ఉమాకాంత్ పటేల్ తదితరులు పాల్గొన్నారు.

# ఆరు గ్యారెంటీలను అమలు చేయాలని బీఆర్ఎస్ నిరసన





**ఉద్యమ కెరటం, సిర్పూర్(యు):** కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన 420 హామీలు, ఆరు గ్యారెంటీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం సిర్పూర్(యు) మండల బీఆర్ఎస్ నాయకులు ఎంపీడీఓ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. అనంతరం ఎంపీడీఓ రవీందర్కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీల అమలుపై కాంగ్రెస్ ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను వెంటనే నెరవేర్చి, ఆరు గ్యారెంటీలతో పాటు 420 హామీలను అమలు చేయాలని కోరారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం జాప్యం చేయడం సరికాదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఆత్రం భగవంత్రావు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తొడసం ధర్మారావు, మాజీ ఎంపీపీ తొడసం భాగ్యలక్ష్మి, బీఆర్ఎస్ సర్పంచులు కొమురం భీంరావు, ఆత్రం ఓం ప్రకాష్, సిడం విజయలక్ష్మి, కుర్మంటే కమల, పర్లాద్, ఉప సర్పంచ్ ఆత్రం మక్తర్ సావ్, బీఆర్ఎస్ నాయకులు అర్క నాగోరావు, సలం రాజేష్, పెందోర్ అర్జున్, పెందోర్ శంకర్, కోవ నాందేవ్, మాడావి భోజిరావు, తొడసం తిర్మన్రావు, మాడావి మానుకు, గొడం అమృత్రావు, ఆదిల్, కార్యకర్తలు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ ఎమ్మెల్యేల అరెస్టు దుర్మార్గం

- **ప్రజాస్వామ్య హక్కులను కాలరాస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం**
- **కుత్బుల్లాపూర్ బీఆర్ఎస్ నేత శంభీపూర్ క్రిష్ణ**

**ఉద్యమ కెరటం,కుత్బుల్లాపూర్ ప్రతినిధి:** కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో ప్రజా సమస్యలను అసెంబ్లీ వేదికగా ప్రశ్నించేందుకు వర్షాకాల అసెంబ్లీ సమావేశాలకు వెళ్తున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను అరెస్ట్ చేయడం దుర్మార్గమని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ నేత శంభీపూర్ క్రిష్ణ విమర్శించారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల అరెస్టును నిరసిస్తూ సోమవారం దుండిగల్ సర్కిల్ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. దుండిగల్ గండిమైసమ్మ సర్కిల్ కార్యాలయం వద్ద నిర్వహించి కాంగ్రెస్ ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన తెలిపారు. అనంతరం శంభీపూర్ క్రిష్ణ మాట్లాడుతూ ప్రజా సమస్యలను అసెంబ్లీలో ప్రస్తావించి ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నించేందుకు వెళ్తున్న ప్రతిపక్ష ప్రజాప్రతినిధులను అరెస్ట్ చేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమన్నారు. కేవలం నల్ల దుస్తులు ధరించారనే కారణంతో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను అరెస్ట్ చేయడం ద్వారా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాస్వామ్య హక్కులను కాలరాస్తోందని ఆయన ఆరోపించారు. ఎన్ని అడ్డంకులు సృష్టించినా ప్రజా సమస్యలపై బీఆర్ఎస్ పోరాటం ఆగదని శంభీపూర్ క్రిష్ణ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో దుండిగల్ సర్కిల్ బీఆర్ఎస్ నాయకులు,



కార్యకర్తలు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

# ఫీజుల బకాయిలపై బీజేపీ లడాయి

- **అసెంబ్లీ ముట్టడికి బయలుదేరిన వడ్డేపల్లి రాజేశ్వరరావు హౌస్ అరెస్ట్**

**ఉద్యమ కెరటం,కూకట్పల్లి ప్రతినిధి:** విద్యార్థుల ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బీజేపీ రాష్ట్ర పార్టీ ఇచ్చిన పిలుపు మేరకు చేపట్టిన "ఫీజుల బకాయి బీజేపీ లడాయి" కార్యక్రమంలో భాగంగా అసెంబ్లీ ముట్టడికి బయలుదేరిన బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావును కూకట్పల్లి పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు. నియోజకవర్గ కార్యకర్తలతో కలిసి అసెంబ్లీ ముట్టడి కార్యక్రమానికి బయలుదేరిన రాజేశ్వరరావును పోలీసులు ఇంటి వద్దే అడ్డుకుని నిర్బంధించారు. ఈ సందర్భంగా వడ్డేపల్లి రాజేశ్వరరావు మాట్లాడుతూ.. విద్యార్థుల భవిష్యత్తుతో ముడిపడి ఉన్న



ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలను ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లక్షలాది మంది విద్యార్థులు ఫీజు రీయింబర్స్మెంట్ కోసం ఎదురుచూస్తున్నారని, బకాయిలు విడుదల కాకపోవడంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. విద్యార్థుల న్యాయమైన హక్కుల కోసం బీజేపీ నిరంతరం పోరాటం చేస్తుందని ఆయన స్పష్టం చేశారు. ప్రజా సమస్యలపై శాంతియుతంగా నిరసన తెలిపేందుకు వెళ్తున్న బీజేపీ నాయకులు, కార్యకర్తలను హౌస్ అరెస్ట్ చేయడం, అడ్డుకోవడం ప్రజాస్వామ్య హక్కులను కాలరాయడమేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థుల ఫీజు బకాయిలను పూర్తిగా విడుదల చేసే వరకు బీజేపీ పోరాటం ఆగదని, విద్యార్థులకు న్యాయం జరిగే వరకు ప్రభుత్వంపై ఒత్తిడి కొనసాగిస్తామని వడ్డేపల్లి రాజేశ్వరరావు స్పష్టం చేశారు.

# తిమ్మాపూర్ లో ఎమ్మెల్సీ తాతా మధు దిష్టిబొమ్మ దహనం

**ఉద్యమ కెరటం,మానకొండూర్ ప్రతినిధి :**

తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాత మధు అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా సోమవారం తిమ్మాపూర్ మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ మండలశాఖ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ శాసనసభాపక్ష నేత కేసీఆర్, ఆ పార్టీ ఎమ్మెల్సీ తాతా మధు దిష్టిబొమ్మలను దహనం చేశారు. స్పీకర్ కు భేషరతుగా ఎమ్మెల్సీ మధు క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. దళితులంటేనే గిట్టని కేసీఆర్, మధు లాంటి వారి అహంకారాన్ని తగ్గించాలంటే శిక్ష తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి దావు సంపత్ రెడ్డి, నుస్తులాపూర్, పోరండ్ల ప్యాక్స్ చైర్మన్లు మోరపల్లి రమణారెడ్డి,గోపు మల్లారెడ్డి,పార్టీ నాయకులు గంకిడి లక్ష్మారెడ్డి, తుమ్మనపల్లి శ్రీనివాసరావు, శ్రీగిరి రంగారావు, కుంట రాజేందర్ రెడ్డి, కంది అశోక్ రెడ్డి, బుదారపు శ్రీనివాస్, కొండలరావు, కొత్త తిరుపతిరెడ్డి, పోలు రాము, రమేష్, తమ్మనవేణి రమేశ్, పొన్నాల సంపత్, రెడ్డిగాని రాజు, మంచాల అంజయ్య, సంపత్ రెడ్డి, శ్రీనివాస్, పోతుగంటి శ్రీనివాస్, రజాక్ తోపాటు వివిధ గ్రామాల సర్పంచులు, పార్టీ అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# బాధిత కుటుంబాన్ని బీఆర్ఎస్ నాయకురాలి పరామర్శ



**ఉద్యమ కెరటం, జైనూర్:** జైనూర్ మండల బీఆర్ఎస్ పార్టీ ఉపాధ్యక్షుడు ఆత్రం శంకర్ కోలాం తండ్రి, పానపాటర్ గ్రామపంచాయతీ సర్పంచ్ ఆత్రం తులసి మామయ్య ఆత్రం వినాయకరావు ఇటీవల హఠాన్మరణం చెందారు. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ పార్టీ నాయకురాలు మర్సుకొల సరస్వతి సోమవారం వారి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతికి గల కారణాలను కుటుంబ సభ్యుల ద్వారా అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆదివాసీ సాంప్రదాయం ప్రకారం నేలపై చాయ్ పోసి నివాళులర్పించారు. అనంతరం దుఃఖంలో ఉన్న కుటుంబ సభ్యులను ఓదార్చి ప్రగాఢ సానుభూతి తెలిపారు. అధైర్య పడవద్దని, కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఆమె వెంట కెరమెరి మాజీ ఎంపీపీ పెందోర్ మోతీరాం, మాజీ సర్పంచ్ తొడశం జగన్నాథ్, పెందోర్ శ్రీనివాస్, అనుముల శంకర్ తదితరులు ఉన్నారు.

# ముత్తగూడెం వద్ద ఘోర రోడ్డు ప్రమాదం

## ఒకరు మృతి



**ఉద్యమ కెరటం, సత్తుపల్లి:** ఖమ్మం జిల్లా పెనుబల్లి మండలం ముత్తగూడెం వద్ద విషాదం చోటుచేసుకుంది. కంటైనర్ లారీ బైక్ను ఢీకొన్న ఘటనలో ఓ యువకుడు అక్కడికక్కడే మృతిచెందాడు. వివరాల్లోకి వెళితే.. పెనుబల్లి మండలం ముత్తగూడెం సమీపంలో బైక్పై వెళ్తున్న యువకుడిని కంటైనర్ లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైక్పై వెళ్తున్న వ్యక్తి తలకు తీవ్ర గాయాలు కావడంతో తలభాగం నుజ్జునుజ్జు అయి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడిని వైరా మున్సిపాలిటీ 1వ వార్డుకు చెందిన కడారి రాకేష్గా గుర్తించారు. సమాచారం అందుకున్న వీఎం బంజర్ పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పెనుబల్లి ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# ఘనంగా ఏలేటి అశ్విన్ రెడ్డి జన్మదిన వేడుకలు



**ఉద్యమ కెరటం, ఇచ్చోడ:** ఆదిలాబాద్ జిల్లా పొలిటికల్ అఫైర్స్ కమిటీ సభ్యులు ఏలేటి అశ్విన్ రెడ్డి జన్మదిన వేడుకలను సోమవారం మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు కేక్ కట్ చేసి అశ్విన్ రెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కళ్లెం నారాయణరెడ్డి, స్థానిక సర్పంచ్ కొడప జలే జాకు, ఏఎంసీ చైర్మన్ సత్యవతి కోటేష్, జిల్లా ఉపాధ్యక్షుడు మాధవ్ పటేల్, ఎస్సీ సెల్ జనరల్ సెక్రెటరీ కొత్తూరు లక్ష్మణ్, బోథ్ నియోజకవర్గ మైనార్టీ సెల్ అధ్యక్షుడు మొహమ్మద్ ముస్తఫా, మండల మాజీ అధ్యక్షుడు గుమ్మడి భీమ్ రెడ్డి, మాజీ జనరల్ సెక్రెటరీ చోలే ప్రభాకర్, మాజీ ఉప సర్పంచ్ మహబూబ్, సీనియర్ నాయకులు రషీద్, బొజ్జ రవి, మజీద్ ఖాన్, మధుకర్, సాదిక్, తుమ్మల వెంకట్ రెడ్డి, షేక్ వహీద్ తదితరులు పాల్గొన్నారు.